Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 17 | సంచిక: 11 | కరీంనగర్ | శుక్రవారం 5 జూన్ 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## రేవంత్ పర్యటన..ముందుస్తు అరెస్ట్‌లు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జోగులాంబగద్వాల, జూన్4 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం గద్వాల జిల్లాలో పర్యటన సందర్భంగా పోలీసులు బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. గద్వాల నియోజకవర్గ నాయకుడు బాసు హనుమంతు నాయుడును పోలీసులు అర్ధరాత్రి నుంచి హౌస్ అరెస్ట్ చేశారు. అదేవిధంగా పార్టీ సీనియర్ నాయకులు నాగర్ దొడ్డి వెంకట్ రాములు, కురువపల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్‌ను అరెస్టు చేయడం పట్ల హనుమంతు నాయుడు మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన

11లో

## అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

-అమీర్‌పేట-ఎస్సార్ నగర్ మధ్య ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూన్4 : హైదరాబాద్ అమీర్‌పేటలో గురువారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. శ్రీనివాసనగర్ వెస్ట్‌లో, మెట్రో పిల్లర్ నంబర్ – 1043 సమీపంలో ఉన్న కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదం కారణంగా మంటలు భారీగా ఎగసిపడ్డాయి. దీంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. అగ్నిప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది,

11లో

## కొడంగల్ ఎత్తిపోతల ద్వారా లక్ష ఎకరాలకు

# సాగునీరు

- ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ పరిశీలన
- త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నారాయణపేట, జూన్ 4 : మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. బీమా కృష్ణా నదులపై నిర్మించనున్న ప్రాజెక్టు పనుల పురోగతిపై గురువారం ముఖ్యమంత్రి బెంగుళూరు నుంచి నేరుగా మక్తల్ చేరుకోగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఫోటో గ్యాలరీని ముఖ్యమంత్రి వీక్షించారు. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భీమా కృష్ణా నదులపై ప్రతిపాద బ్యారేజీ పనులు పురోగతికి సంబంధించిన

11లో

## కార్మికులకు అండగా నిలిచేది

# బిఆర్ఎస్

- కార్మికుల సమస్యలపై సిఎంకు పట్టింపు లేదు
- జలమండలి గేట్ మీటింగ్‌లో తలసాని శ్రీనివాసయాదవ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 4 : ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై పోరాడేది గులాబీ జెండా మాత్రమేనని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం ఖైరతాబాద్ జలమండలి కార్యాలయం వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన హాజరై ప్రసంగించారు. వాటర్ బోర్డులో 50 సంవత్సరాల లో ఎన్నడూ లేని విధంగా కేసీఆర్ ప్రభుత్వం 650 మంది ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వాటర్ వర్క్స్ బోర్డు లోని ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై అవగాహన ఉన్న రాంబాబు యాదవ్‌ను 6 వ తేదీన జరిగే గుర్తింపు ఎన్నికలలో గెలిపించుకోవాలని తలసాని పిలుపునిచ్చారు. మున్సిపల్ శాఖను తన వద్ద పెట్టుకున్నముఖ్యమంత్రి



రెండున్నర సంవత్సరాలలో ఒక్కసారైనా సమీక్ష చేశారా? అని తలసాని ప్రశ్నించారు. మీ సమస్యలపై ముఖ్యమంత్రికే పట్టింపు లేనప్పుడు ఆ పార్టీకి సంబంధించిన వ్యక్తిని గెలిపిస్తే ఎలాంటి ప్రయోజనం ఉ ఒడదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన చేతకాక ప్రశ్నించే వారిపై ఎదురుదాడి చేస్తున్నారని, అక్రమ కేసులు పెడుతున్నారని తలసాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం అవగాహన, ప్రణాళిక లేకుండా మూడు కార్పొరేషన్లుగా విభజించి ఉద్యోగులు, ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని తలసాని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ రోజు కూడా ప్రజలకు

11లో

## మార్కెట్ వ్యాల్యూ ప్రకారం

# భూముల ధరలు

- నేటి నుంచే అమల్లోకి పెంచిన రేట్లు
- రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం
- సబ్ రిజిస్ట్రార్ల అధికారాలకు కత్తెర
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 4 : మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు శుక్రవారం నుంచి పెరుగుతాయని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భూముల ధరలు ఏరియాను బట్టి 50 నుంచి100 శాతం పెరుగుతాయని తెలిపారు. ప్రైమ్ ఏరియాలో 100 శాతం పెరుగుతాయన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. భూముల వ్యాల్యూ పెరగటంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 1200 నుంచి రూ. 1400 కోట్ల మేర ఆదాయం వస్తుందని చెప్పారు. హయ్యర్ సైడ్ ఏరియాలు శేరిలింగంపల్లి, రాజేందర్ నగర్, ఖాజాగూడ తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు



పెరగవన్నారు. ఆయా ప్రాంతాల్లో ఛార్జీలు పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని తెలిపారు. ఇక నుంచి సబ్ రిజిస్ట్రార్లకు ఫుల్ పవర్స్ కట్ చేశామని.. వారికి మినిమమ్ పవర్స్ మాత్రమే ఉంటాయని మంత్రి పొంగులేటి వివరించారు. భూ సేకరణ సమయంలో ప్రభుత్వానికి కొంత నష్టం జరిగిందన్నారు. కానీ రైతులకు మాత్రం లాభం జరుగుతుందన్నారు. ఇన్నర్ సైడ్

11లో

## నగరంలో వరుసగా

# అగ్నిప్రమాదాలు

- ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణం: తలసాని



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూన్4 : అగ్నిప్రమాదాలను నివారించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం అమీర్ పేటలోని మైత్రివనం వద్ద అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సందర్శించారు. ప్రమాదం వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంతో నష్టపోయిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో వరుసగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం

11లో

## ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

- వర్షాభావంపై సన్నద్ధం చేయండి
- వ్యవసాయాధికారులకు మంత్రి తుమ్మల సూచన



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూన్4 : వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులను ముందుగానే సన్నద్ధం చేయాలని ఉన్నతాధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై గ్రామసభల్లో రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తక్కువ నీటితో పంటల సాగు చేసేలా రైతులను ప్రోత్స హించాలని అధికారులకు స్పష్టం చేశారు. పంట వ్యర్థాలను కాల్చ డంపై కఠిన చర్యలు తీసుకోవా లని సూచించారు. అందుకోసం అన్ని జిల్లాల్లో శాటిలైట్ ఆధారిత పంట వ్యర్థాల కాల్చివేతలపై పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. కొహెడ అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపనకు ఏర్పాట్లు వేగవంతం చేసినట్లు చెప్పారు. రూ. 2,284.32 కోట్లతో కొహెడలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్ నిర్మాణం

11లో

## ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలి

### బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి డిమాండ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జూన్ 4 : రాష్ట్ర ప్రజానికంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు లేదని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ఆరోపించారు. వానకాలం పంట సీజన్ మరికొద్ది రోజుల్లో ప్రారంభమవుతున్నా గాని ప్రభుత్వానికి ముందస్తు కార్యచరణ ప్రణాళికను ఇంకా తయారు చేసుకోలేదని వెల్లడించారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట రుణాలకు సంబంధించి కార్య చరణను ఇంకా రూపొందించ లేదని ఆరోపించారు. కనీసం ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా మూడు సంవత్సరాల కాలంలో ఆరు పంటలు పండాయని, ఇందులో ఎన్ని పంటలకు రైతు భరోసా కల్పించారో

11లో

## సూడాన్ ప్రయాణికుడికి

# ఎబోలా లక్షణాలు

- గాంధీ ఆస్పత్రికి తరలింపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూన్4 : శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడి ఎబోలా వైరస్ హిస్టరీ ఉన్నట్టు గుర్తించారు. గురువారం సూడాన్ నుంచి నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న మహ్మద్ అనే ప్రయాణికుడికి.. ఎయిర్‌పోర్టులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ కేంద్రంలో పరీక్షలు నిర్వహించారు. ఎబోలో వైరస్ హిస్టరీ ఉన్నట్టు గుర్తించిన వైద్య సిబ్బంది వెంటనే అప్రమత్తయ్యారు. వెంటనే అతన్ని గాంధీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ సెంటర్‌కు తరలించారు. శాంపిల్స్ సేకరించి సీసీఎంబీకి పంపించినట్టు గాంధీ ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

## పవన్ కళ్యాణ్ తెలంగాణకు

# వ్యతిరేకంగా మాట్లాడారా?

- మీటింగ్‌కు అనుమతి ఎందుకు ఇవ్వలేదో చెప్పాలి
- ఇంకా సెంటిమెంట్ రాజకీయాలతో మోసం చేస్తే ఊరుకోరు
- బిఆర్ఎస్, కాంగ్రెస్‌ల తీరుపై మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు



హైదరాబాద్, (ప్రజాలక్ష్యం ప్రతినిధి) : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా ఎప్పుడు మాట్లాడలేదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. ఆయన మీటింగ్‌కి అనుమతి ఇస్తే ఏమవుతుందని రాంచందర్ రావు ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లో రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సెంటిమెంట్‌ని మరోసారి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణను వ్యతిరేకించిన ఎంఐఎంని ఎందుకు దగ్గరకు తీసుకున్నారని ప్రశ్నించారు. తెలంగాణ సెంటిమెంట్ పేరుతో మళ్లీ ప్రజల

11లో

# కూనంనేనికి బిజెపి గురించి మాట్లాడే స్థాయి లేదు

- పొత్తు లేకుండా గెలిచే సత్తా కూనంనేనికి ఉందా ?
- మీడియా అటెన్షన్ కోసమే ప్రధానమంత్రి మోడీపై విమర్శలు
- కొత్తగూడెం సీటు కోసం పార్టీని తాకట్టు పెట్టిన మీరా? బీజేపీని విమర్శించేది
- దమ్ముంటే రాజీనామా చేసి పోటీకి రావాలని సవాల్
- బీజేపీ నుంచి జలగం పోటీ, ఓడిపోతే రాజకీయ సన్యాసం
- కూనంనేనికి బీజేపీ సవాల్
- భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం జూన్ 4 : కమ్యూనిస్టులకు ప్రజలు రాజకీయ సన్యాసం ఎప్పుడో ఇచ్చారని ఇంకా కొత్తగా నువ్వు తీసుకునే సన్యాసం ఏమిటని బిజెపి భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. గురువారం మండల కేంద్రమైన భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లిలోని బిజెపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అనుసరిస్తున్న విధానాలు మాట్లాడుతున్న విషయాలపై ఆయన మండిపడ్డారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారతీయ జనతా పార్టీ ఒక్క ఎమ్మెల్యే గెలిచిన తాను రాజకీయ సన్యాసం చేస్తానని ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేయడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కమ్యూనిస్టులకు రాజకీయ సన్యాసం ప్రజలు ఎప్పుడో ఇచ్చారని ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు. రెండు సార్లు బూర్జువా పార్టీల అండతో ఎమ్మెల్యే అయిన సాంబశివరావుకు భారతీయ జనతా పార్టీ గురించి మాట్లాడే స్థాయి లేదని తీవ్రంగా విమర్శించారు. బిజెపిని సవాల్ చేసిన నాయకులు, పార్టీలు మట్టి కరిచిపోయాయని వ్యాఖ్యానించారు. అంతేగాక కమ్యూనిస్టుల ఆధీనంలో కొనసాగిన రాష్ట్రాలు కనుమరుగై బిజెపి కాషాయ జెండాలు రెపరెపలాడుతున్నాయి అన్నారు. మొదటిసారి కొత్తగూడెం నియోజకవర్గంలో మహా కూటమి మద్దతుతో కేవలం 1500 ఓట్ల మెజారిటీతో కూనంనేని గెలిచారని, అనంతరం 2014లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఐదో స్థానానికి పడిపోయారని అదే కమ్యూనిస్టులు బలమని ఎద్దేవా చేశారు. రెండేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో, కమ్యూనిస్టు పార్టీ నైతికతను పక్కనపెట్టి ఓటుకు వెయ్యి నుంచి 1500 ఇచ్చి విజయం సాధించారని విమర్శించారు. ఎమ్మెల్యే కూనంనేనికి ధైర్యం ఉంటే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి చేయాలని, అదే భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట రావు పోటీ చేస్తారని ఆయనపై గెలవగలరా అని ప్రశ్నించారు. జలగం వెంకట రావు బిజెపి అభ్యర్థిగా ఓడిపోతే తాము రాజకీయ సన్యాసం చేస్తామని సవాల్ విసిరారు. కొత్తగూడెం కార్పొరేషన్ లో ఎన్నికల్లో కాంగ్రెస్ పై విమర్శలు చేస్తూ ప్రచారం చేసి మళ్ళీ అదే కాంగ్రెస్ పార్టీ మద్దతుతో మేయర్ పదవిని దక్కించుకున్న సిపిఐ పార్టీ నేతలు నియోజకవర్గంలో శాంతిభద్రత మంటగలుపుతున్నారని తీవ్రంగా విమర్శించారు. మిషన్ భగీరథ పైప్ లైన్ కోసం గత ఎమ్మెల్యేల హయాంలో కోట్లాది రూపాయలు కేటాయించారని, తిరిగి భగీరథ పైప్లైన్ కోసం ప్రభుత్వం రోడ్లు తవ్వుతూ ఆగమాగం చేస్తున్నారని ఆరోపించారు. కొత్త లైన్ లంటూ కమిషన్ కోసమే పనులు చేస్తున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. కార్పొరేటర్లకు ఎటువంటి గౌరవం లేదని, చిన్న చిన్న కాంట్రాక్ట్ పనులు సైతం ఎమ్మెల్యేనే చూసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ పట్టుమని పది ఎమ్మెల్యే స్థానాల్లో పోటీ చేసే స్థాయిలేని కమ్యూనిస్టు పార్టీ బిజెపిని విమర్శించడమా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు జిల్లా ఉపాధ్యక్షురాలు చెరుకు భాగ్యలక్ష్మి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోడియం బాలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జాటోత్ వెంకన్న నాయక్, పైడిపాటి రవీందర్, సముద్రాల గాయత్రి, పాల్వంచ టౌన్ అధ్యక్షులు రాపాక రమేష్, చుంచుపల్లి మండల అధ్యక్షులు బలగం శ్రీధర్, జిల్లా కార్యాలయ కార్యదర్శి దురిశెట్టి కుమార్, జిల్లా కార్యదర్శి తుంపూరి శివ, సీనియర్ నాయకులు గుమలాపురం సత్యనారాయణ, మీడియా కన్వీనర్ రామారావు జిల్లా నాయకులు, మండల స్థాయి నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# "జీరో హార్మ్ లక్ష్య సాధనకు ప్రతి ఉద్యోగి కట్టుబడి పనిచేయాలి"

## - కేటీకే-1 గనిలో ప్రత్యేక భద్రతా అవగాహన కార్యక్రమంలో జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, జూన్ 4 : ప్రమాద రహిత పనివాతావరణం కల్పించేందుకు ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ "జీరో హార్మ్" లక్ష్య సాధనకు కట్టుబడి పనిచేయాలని సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రమాదాల నివారణ, ఉద్యోగుల్లో భద్రతా చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా కేటీకే-1 గనిలో గురువారం ప్రత్యేక భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగుల భద్రత సంస్థకు అత్యంత ప్రాధాన్యత అంశమని పేర్కొన్నారు. గనుల్లో విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి అప్రమత్తతతో పనిచేస్తూ భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రమాదాలను పూర్తిగా నివారించాలంటే భద్రతా నిబంధనల అమలులో రాజీ పడకూడదని, సురక్షిత పనితీరుతోనే ప్రమాదరహిత వాతావరణాన్ని నిర్మించవచ్చని ఆయన తెలిపారు. భద్రతపై అవగాహనతో పాటు వ్యక్తిగత బాధ్యత కూడా అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఉద్యోగులకు భద్రతా నియమాలు, జాగ్రత్తలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. భద్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని, భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా సంస్థ అభివృద్ధికి తోడ్పడటంతో పాటు ప్రాణనష్టాలను నివారించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ మాటూరి రవీందర్, ఏరియా ఇంజనీర్ రాజారావు, కేటీకే-1 కాలరీ మేనేజర్ ప్రవీణ్ విక్రమ్, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక విధానాల వల్లే సింగరేణికి నష్టాలు

## - రాజకీయ బానిస యూనియన్ల వల్లే సింగరేణి ఉనికి ప్రశ్నార్థకం - 12వ వేతన సవరణ కోసం బీఎంఎస్ ప్రత్యేక చొరవ. - ఎస్సీసీఎంకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, జూన్ 4:సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5 ఇంక్లైన్‌లో గురువారం నిర్వహించిన కార్మికుల సమావేశంలో బిఎంఎస్ అనుబంధ ఎస్సీసీఎంకేఎస్ నాయకులు సింగరేణి సంస్థ ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. పిట్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి రాజు నాయక్ అధ్యక్షత వహించగా, ఎస్సీసీఎంకేఎస్ ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి, అప్పాని శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అప్పాని శ్రీనివాస్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అలాగే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా సింగరేణి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేసే కార్మిక సంఘాల కారణంగా సంస్థ ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీలు సమ్మె పేరుతో కార్మికులను తప్పుదోవ పట్టించి, యాజమాన్యంతో చర్చలు జరిపినా కార్మికులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని ఆరోపించారు. తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థలు సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) రాజకీయాలకు అతీతంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతోందని తెలిపారు. సింగరేణి భవిష్యత్తు కోసం కొత్త బొగ్గు బ్లాకుల సాధన, కార్మిక సంక్షేమం, సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు.

**12వ వేతన సవరణపై బీఎంఎస్ చొరవ:**

ప్రస్తుతం అమల్లో ఉన్న 11వ వేతన సవరణ గడువు ఈ నెల 30తో ముగియనున్న నేపథ్యంలో, జూలై 1 నుంచి అమలులోకి వచ్చే 12వ వేతన సవరణ కోసం జేబీసీసీఐ కమిటీని తక్షణమే



ఏర్పాటు చేయాలని బీఎంఎస్ జాతీయ కోల్ సెక్టర్ ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, కోల్ ఇండియా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువస్తున్నారని తెలిపారు.

**జూన్ 7న ఎస్సీసీఎంకేఎస్ 29వ మహాసభ:**

భూపాలపల్లిలో జూన్ 7న నిర్వహించనున్న ఎస్సీసీఎంకేఎస్ 29వ మహాసభలను విజయవంతం చేయాలని సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులకు పిలుపునిచ్చారు. మహాసభలో రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన బకాయిల విడుదల, 12వ వేతన సవరణ, కొత్త బొగ్గు గనుల ప్రారంభం, మెడికల్ బోర్డుల నిర్వహణ, డిపెండెంట్ ఉద్యోగాలు, కార్మికుల గృహ కల, పెర్క్‌పై ఆదాయపు పన్ను రద్దు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం, కాంట్రాక్ట్ కార్మికులకు మెరుగైన వేతనాలు తదితర అంశాలపై కీలక తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో భూపాలపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు వెలబోయిన సుజేందర్, సత్యారి శ్రీనివాస్, ఓరం లక్ష్మణ్, కొత్తూరి మల్లేష్, కటకం శ్రీనివాస్, అల్లం శ్రీనివాస్, పునీత్‌రావు, చిట్యాల ప్రవీణ్, రాజు నాయక్, దేవర సమ్మయ్యతో పాటు పలువురు కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.




# జూన్ 14న ఇల్లందులో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి నృత్య పోటీలు

## - యువ ప్రతిభకు వేదికగా వెంకట్ డ్యాన్స్ అకాడమీ - వీబీసీసీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూన్ 4: కీర్తిశేషులు బాల, సాయి జ్ఞాపకార్థం వెంకట్ డ్యాన్స్ అకాడమీ, వీబీసీసీ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న ఇల్లందులోని సీఈఆర్ క్లబ్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన కళాకారులకు ఇలాంటి పోటీలు తమ ప్రతిభను చాటుకునే మంచి అవకాశంగా నిలుస్తాయని పేర్కొన్నారు. జూన్ 14న ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ పోటీల్లో వెస్ట్రన్, ఫోక్, క్లాసికల్ విభాగాల్లో జూనియర్, సీనియర్ కేటగిరీలతో పాటు సోలో, డ్యూయెట్ ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీదారులు తాము ప్రదర్శించనున్న పాటలను పెన్‌డ్రైవ్ లేదా మొబైల్ ఫోన్‌లో తీసుకురావాలని సూచించారు. క్లాసికల్ నృత్య ప్రదర్శనకు ఐదు నిమిషాలు, ఫోక్ మరియు వెస్ట్రన్ నృత్యాలకు నాలుగు నిమిషాల సమయం కేటాయించనున్నట్లు వెల్లడించారు. ప్రతి విభాగంలో కనీసం పది ఎంట్రీలు ఉంటేనే బహుమతులు ప్రదానం చేస్తామని, విజేతల ఎంపికలో న్యాయనిర్ణేతల నిర్ణయమే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రంతో పాటు ఉచిత భోజన సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. విజేతలకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన నృత్య కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. పోటీల రిజిస్ట్రేషన్, ఇతర వివరాల కోసం కడారి వెంకటేష్ (8374579497, 7989163958), సాయి మాస్టర్ (9030099139)లను సంప్రదించాలని సూచించారు.

# పంట మార్పిడితో ఆదాయం పెంచుకోవాలి

## - రైతులకు అవగాహన కల్పించాలి - ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ - మైలారం గ్రామసభలో పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్ రాహుల్ శర్మ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, జూన్ 4 : పంట మార్పిడి విధానాన్ని రైతులు అనుసరించి అధిక ఆదాయం వచ్చే పంటల సాగుపై దృష్టి సారించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం గణపురం మండలం మైలారం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఆదాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల విద్యుత్ ప్రమాదంతో 60 ఎకరాల పంటలు దగ్ధమవడంతో పాటు నలుగురు ప్రాణాలు కోల్పోయిన ఘటనను ప్రస్తావిస్తూ, విద్యుత్ సంబంధిత సమస్యలను గ్రామసభల ద్వారా తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెరువుల మట్టిని రైతులు తమ పొలాలకు తీసుకెళ్లేలా అవకాశాలు కల్పించాలని సూచించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూమి సారవంతత తగ్గి దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని, రైతులు అలాంటి చర్యలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. విద్యార్థులకు యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు అందజేస్తున్నామని, నియోజకవర్గానికి ఒక మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేసి ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజన వసతి కల్పించడంతో పాటు గురుకుల విద్యను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఏళ్ల తరబడి సాగుచేస్తున్న భూములకు పట్టాలు లేని రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, భూభారతి కార్యక్రమం ద్వారా అర్హులకు హక్కు పత్రాలు అందజేస్తామని తెలిపారు. జిల్లాలో 8 వేల ఎకరాల్లో భూ సర్వే కొనసాగుతోందని, సర్వే పూర్తయిన తర్వాత పట్టాల జారీ ప్రక్రియ చేపడతామని పేర్కొన్నారు. గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సర్పంచులు కృషి చేయాలని సూచించిన ఎమ్మెల్యే, ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీలు స్వయం ఆదాయ వనరులు పెంపొందించుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.200 కోట్ల వ్యయంతో 40 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, 60 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటు




చేస్తున్నట్లు తెలిపారు. అలాగే రూ.50 కోట్లతో 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాముల నిర్మాణం, రూ.500 కోట్లతో బైపాస్ రోడ్డు, చెల్పూర్--గూడేప్పాడు మధ్య నాలుగు లైన్ల రహదారి అభివృద్ధి చేపడుతున్నట్లు వెల్లడించారు. గణపురం రిజర్వాయర్ పంటకాలువల మరమ్మతులకు రూ.32 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు కార్యక్రమాలు కొనసాగనున్నాయని, అందులో భాగంగా గ్రామాలు, మున్సిపాలిటీల్లో వార్డు, గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగు కాలువల శుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. వనమహోత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు గ్రామపంచాయతీలు స్థలాలను గుర్తించాలని సూచించారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో ప్రతి ఓటరు తమ వివరాలను పరిశీలించి నవీకరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, సీఐ కరుణాకర్, సర్పంచ్ సమ్మయ్య నాయక్, పీఏసీఎస్ చైర్మన్ కుమార్ యాదవ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

## - 51 మంది లబ్ధిదారులకు రూ.16.16 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ - మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో అందజేత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూన్ 4: వైద్య ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి అన్నారు. ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపా లిటీ పరిధికి చెందిన 51 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.16,16,500 విలువైన చెక్కులను దయాకర్ రెడ్డి పంపిణీ చేశారు. లబ్ధిదారుల్లో ఖమ్మం రూరల్ మండలానికి చెందిన 30 మంది, ఏదులాపురం మున్సిపాలిటీకి చెందిన 21 మంది ఉన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన దయాకర్ రెడ్డి, నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి కీలక పాత్ర పోషిస్తోందన్నారు. అత్యవసర వైద్య చికిత్సల కోసం భారీ ఖర్చులు భరించలేని కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందిస్తూ భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలి

## - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - ప్రత్యేక గ్రామసభలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది, జిల్లా కలెక్టర్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జూన్ 04 : 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వేడిపల్లి మండలం పోరుమల్ల గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామసభలో వర్షాకాల ముందస్తు చర్యలు, ఘన వ్యర్థాల నిర్వహణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, జల సంరక్షణ, వన మహోత్సవం, సురక్షిత తాగునీరు, వ్యవసాయ రంగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళా సంరక్షణ, "అరైవ్ అలైవ్" కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ..వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. జల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. మహిళల భద్రత, రోడ్డు భద్రత అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడుతూ..గ్రామాల్లో సురక్షితమైన తాగునీటి సరఫరా కోసం అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. రానున్న వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు వినియోగిస్తూ వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని తెలిపారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, నీటి వనరులను సంరక్షిస్తూ ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. గ్రామంలో ఐదు అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉండగా, ఇప్పటికే ఒక భవనానికి మంజూరు లభించిందని, మిగిలిన భవనాలకు అవసరమైన భూమి అందుబాటులో ఉంటే మంజూరు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే మూడు వీఓ భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉండగా, ఒక భవనానికి ఇప్పటికే మంజూరు లభించిందని, మిగిలిన రెండు భవనాలకు భూమి అందుబాటులో ఉంటే మంజూరు కల్పిస్తామని పేర్కొన్నారు. మంజూరైన భవనాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు జాబితాలో పేరు లేకపోవడంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

## అధికారుల జోక్యంతో తప్పిన ప్రమాదం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాటారం, జూన్ 4 : జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గుండ్రాత్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు జాబితాలో తన పేరు లేకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అధికారుల సకాల జోక్యంతో ప్రమాదం తప్పింది. గ్రామానికి చెందిన నగునూరి శ్రీనివాస్ గురువారం ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభకు హాజరయ్యాడు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అక్కడే ఉన్న అధికారులు, స్థానికులు వెంటనే స్పందించి అతడిని అడ్డుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం శ్రీనివాస్‌తో మాట్లాడిన అధికారులు అతనికి ధైర్యం చెప్పారు. అర్హతలను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకు ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఘటన గ్రామసభలో కొంతసేపు ఉద్రిక్తతకు దారితీసినా, అధికారుల చొరవతో పరిస్థితి సద్దుమణిగింది.

ప్రజాలక్ష్యం
సంపాదకీయం

## తెలంగాణలో సెంటిమెంట్ రాజకీయం !

తెలంగాణను ముంచిన వారంతా ఇప్పుడు వీరతాళ్లు వేసుకుని..నా తెలంగాణ అంటూ ఊరేగుతున్నారు. విగ్రహాల పేరుతో కొందరు నిగ్రహం కోల్పోయి మాట్లాడుతున్నారు. తెలంగాణ అస్తిత్వం ప్రమాదంలో పడ్డదని వాపోతున్నారు. ఇప్పుడు తెలంగాణ సెంటిమెంట్ కోసం మళ్లీ రాజకీయ రగడ మొదలయ్యింది. ఎవరికి వారు తామే తెలంగాణ భావి విధాతలమని మాట్లాడుతున్నారు. పవన్ కళ్యాణ్‌ను బూచిగా చూపి ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతున్నారు. నిజానికి తెలంగాణ ఏర్పడ్డ తరవాత జరిగిన ద్రోహం, అంతకుముందు ఎప్పుడూ జరగలేదు. ఉమ్మడి ఎపిలో జరగనంత దోపిడీ గత 12 ఏళ్లుగా సాగుతోంది. ఎక్కడిక్కడ భూములు దోచుకున్నారు. అప్పుల చేసి దోచుకున్నారు. తెలంగాణను అప్పుసుల కుప్పచేసి అనుభవిస్తున్నారు. ఎవరికి వారు తామే తెలంగాణను ఉద్ధరించామని చెప్పుకుంటున్నారు. నిరుద్యోగ సమస్య తీరలేదు. నీటి సమస్యలు తీరలేదు. నిధులు పారించలేదు. అంతెందుకు రైతులు పండించిన ధాన్యం మద్దతు ధరలకు కొని సేకరణ సక్రమంగా చేయడంలో కూడా విఫలం అయ్యారు. మక్క, జొన్న, మిర్చి, పత్తి రైతులు ఏటా పడుతున్న కష్టాలను పట్టించుకోని అసమర్థులుగా మిగిలి పోయారు. ఇకపోతే తెలంగాణలో కొత్తగా ఆస్తులు సృష్టించలేదు. అయినా పాలకులుగా పనిచేసిన వారు తామే తెలంగాణను ఉద్ధరించామని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ప్రజలకు పెన్షన్లు, ఇళ్లు, ఆరోగ్యశ్రీలు ఎరగా వేసి దర్జాగా దోచేస్తున్నారు. నిజానికి ఉమ్మడి ఎపి నుంచి తెలంగాణ విడివడ్డాక తెలంగాణ అభివృద్ధి చెందిందా..లేక అప్పుల పాలయ్యిందా అంటే..అప్పుల పాలయ్యిందని లెక్కలు చెబుతున్నాయి. సమయానికి జీతాలు ఇవ్వలేని వారు పాలకులు అయ్యారు. హైదరాబాద్ మీ అయ్య జాగీరా అని జనసేనాని పవన్ కళ్యాణ్ అనగానే కొందరు ఒంటి కాలిపై లేచి..అవును మా అయ్య జాగీరే అంటున్నారు. ఎందుకంటే మూడో వ్యక్తి వస్తే..దోచుకోవడానికి అవకాశం ఉండదు కనుక...ఎగిరెగిరి పడుతున్నారు. తెలంగాణ సమాజాన్ని బెదిరిస్తున్నావంటూ పవన్‌ను చీల్చి చెండాడేంత పని చేశారు. పవన్ మీడియా సమావేశంలో మాట్లాడిన మాటలు నిజంగానే తెలంగాణలోని కొందరికి బాధ కలిగించాయి. అందులో అనుమానం లేదు. రాజకీయంగా తెలంగాణలో ఉన్న కొందరు జనసేనలోనూ ఉన్నారు. వారికి పదవులు రావాలంటే జనసేన పక్షాన పోటీ చేయాల్సిందే. రాజకీయ పార్టీ అన్న తరవాత పోటీకి సై అంటుంది. జనసేన కూడా అదే చేసింది. అయితే మిగతా ప్రాంతాలకు, తెలంగాణకు ఓ రేఖ అడ్డంగా ఉంది. అదే సెంటిమెంట్. తెలంగాణ ప్రజలను ముంచిందే సెంటిమెంట్. ఆ సెంటిమెంట్‌తోనే ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డది. అది అడ్డం పెట్టుకునే కెసిఆర్ కుటుంబం పదేళ్లు దర్జాగా తెలంగాణలో పాగా వేసి, ఇష్టారాజ్యంగా దోచుకున్నది. పదవులు, డబ్బులు, భూములు దోచేసారు. లక్షల కోట్లు తెలంగాణ నెత్తిన అప్పులు పెట్టారు. తరవాత గత రెండేళ్లుగా కాంగ్రెస్ కూడా అదే దారిలో నడుస్తోంది. అభివృద్ధి పేరిట ఊదరగొట్టిన కాంగ్రెస్ నేతలు పప్పు బెల్లాల్లా తెలంగాణను పంచుకుంటున్నారు. భూములు యధేచ్ఛగా అమ్మేస్తున్నారు. ఈ క్రమంలో పవన్ రాకతో మరోమారు సెటిమెంట్ రగిల్చి బాగుపడాలన్న ధోరణిలో పొన్నం ప్రభాకర్, కెటిఆర్, కవితలు తామే అసలుసిసలు తెలంగాణ వారుసులమని చెప్పుకునే ప్రయత్నంలో పడ్డారు. తెలంగాణ సమాజం అస్తిత్వ సంక్షోభంల పడుతున్నదనీ గొంతు చించుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మరోసారి ఆంధ్రా ఆధిపత్యం కిందకు వెళుతోందని ప్రకటించుకున్నారు. పవన్ కళ్యాణ్ ఎంట్రీ వెనక బిజెపి, మోడీ ఉన్నారని ఆరోపిస్తున్నారు. తెలంగాణ కూడా భారతదేశంలోనే ఉందని, అందుకు బిజెపి ఎక్కడైనా పావులు కదుపుతుందని తెలుసుకోవాలి. బిజెపికి తెలంగాణ కూడా ఒక రాష్ట్రమని తెలుసు. ఇక్కడ పాగా వేయాలని ఎప్పటనుంచో కలలు కంటోంది. కనుక దాని ప్రయత్నాల్లో అది ఉంది. ఇది రాజకీయం. కెసిఆర్ కూడా భారత రాష్ట్ర సమితి అంటూ దేశాన్ని ఏలుతానని అన్ని రాష్ట్రాలు తిరిగారు. దానిని ఎవరైనా తప్పుపట్టారా అన్నది కెటిఆర్ చెప్పాలి. రాజకీయ పార్టీ పెట్టి ఇక్కడ వైఎస్ షర్మిల కూడా పాదయాత్ర చేశారు. తాను తెలంగాణ బిడ్డనని ప్రకటించుకున్నారు. అప్పుడు లేని రోషం ఇప్పుడే ఎందుకు వచ్చిందన్నది ప్రశ్న. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం స్వరాష్ట్రంలో ఆంధ్రా వలసవాదం పెరిగింది. దానికి కెసిఆర్ ఆద్యులు. ఆయనే మాకు ఆంధ్రాతో పేచీ లేదంటూ..జగన్‌ను పిలిచి భోజనం పెట్టి అలయ్ భలయ్ చేసుకున్నారు. కృష్ణా నీటిని ఎపికి దోచి పెట్టారని వస్తున్న ఆరోపణలకు కెసిఆర్ బృందం నుంచి సమాధానం లేదు. తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకుని, హైదరాబాద్ సంపదను కొల్లగొట్టడానికి వస్తున్నారని జనసేనాని పవన్ కళ్యాణ్‌ను విమర్శించే ముందు..ఇక్కడ ఎంత కొల్లగొట్టారో చెప్పాలి. ధరణి పేరుతో మోసాలు. కాళేశ్వరం పేరుతో దగా. టెలిఫోన్ ట్యాపింగ్. అస్మదీయులకు రాజ్యసభ పదవులు.. ఇలా చెప్పకుంటూ పోతే కథలు కోకొల్లలు. ఇప్పుడు రెండేళ్ల పాలనలో మంత్రులందరిపైనా అవినీతి గుప్పు మంటోంది. అయినా ఎవ్వరు కూడా మాట్లాడడం లేదు. తెలంగాణ మేధావులు నోరు మెదపడం లేదు. కాంగ్రెస్ వచ్చాకనే స్వేచ్ఛ వచ్చిందని కోదండరామ్ సార్ అంటున్నారు. అంటే కెసిఆర్ ఉన్నంతకాలం నిరంకుశ పాలనలో మగ్గామనే అర్థం కదా. తెలంగాణ అస్తిత్వం మీద దాడిలో, మోదీ, చంద్రబాబుల ఉమ్మడి ప్రణాళిక దాగి ఉందని ఘోషిస్తున్న వారు, ఏ రకమైన దాడి జరిగిందో చెప్పాలి. ఈ గడ్డపై నివసిస్తూ ఇక్కడే మమేకమైన వారంతా తెలంగాణ బిడ్డలే. వాళ్ల పిల్లల భవిష్యత్తు, వారి ఉద్యోగాలు, వ్యాపారాలు అన్నీ ఈ తెలంగాణ రాష్ట్రంతోనే ముడిపడి ఉన్నాయి. రాజకీయ పార్టీలు అన్ని చోట్లా తమ అస్తిత్వం కోసం ప్రయత్నం చేస్తుంటాయి. కెసిఆర్ కుటుంబానికి చెందిన పార్టీలే తెలంగాణకు ప్రతినిధులు కాదు. తెలంగాణ కోసం కష్టపడే వారు ఎవరైనా రాజకీయలు చేసుకునే హక్కు ఉంటుంది. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగే సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి పోటీ చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

### మహాసముద్రాల తాపం... వాతావరణ విపత్తుల రూపం...

# ‘ఎల్‌నినో’ మానవాళిపై ప్రభావం

### ప్రకృతి వింత... వాతావరణ ముప్పు: ‘ఎల్‌నినో’ సవాళ్లు - ముందస్తు వ్యూహాలు

## సముద్ర గర్భంలో అలజడి... మానవాళి మనుగడకు సవాలు: ‘ఎల్‌నినో’ ప్రత్యేక కథనం



రామకిష్టయ్య సంగన భట్ల
9440595494

భూగోళంపై మానవాళి మనుగడకు, విశ్వవ్యాప్తంగా వివిధ దేశాల ఆర్థిక స్థిరత్వానికి ప్రకృతి వైపరీత్యాలు, అనిశ్చిత వాతావరణ మార్పులు, అకాల వర్షపాతాలు, తీవ్ర కరువు పరిస్థితులు నేడు అత్యంత ఆందోళనకరమైన సవాళ్లుగా మారాయి. పారిశ్రామిక విప్లవం తదనంతర ఆధునిక యుగంలో మానవ తప్పిదాల వల్ల గ్లోబల్ వార్మింగ్ అంటే భూతాపం రోజురోజుకూ పెరిగిపోతోంది. దీనివల్ల కాలచక్రాలు తారుమారై రుతుపవనాల గమనం పూర్తిగా గందరగోళంలో పడింది. ఈ విధమైన అంతర్జాతీయ వాతావరణ మార్పులకు దారితీస్తున్న అత్యంత శక్తివంతమైన, సంక్లిష్టమైన సహజ పర్యావరణ దృగ్విషయాలలో “ఎల్‌నినో” అగ్రగా మిగా నిలుస్తోంది. ఇటు సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో వచ్చే అసాధారణ మార్పులకు, అటు వాతావరణ పీడన వ్యత్యాసాలకు మధ్య జరిగే ఒక గొలుసుకట్టు ప్రక్రియగా దీనిని శాస్త్రవేత్తలు పరిగణిస్తారు. భూమిపై ఉన్న వివిధ ఖండాల్లో వర్షపాతం, ఉష్ణోగ్రతలు, వ్యవసాయ విస్తీర్ణం, జలవనరుల లభ్యత, జీవవైవిధ్యం, అంతిమంగా ప్రపంచ ఆహారోత్పత్తి వ్యవస్థలపై ఎల్‌నినో చూపించే ప్రతికూల ప్రభావం అపారమైనది. ముఖ్యంగా శతాబ్దాలుగా రుతుపవనాలపైనే పూర్తిగా ఆధారపడి సాగుతున్న భారతదేశ నైరుతి రుతుపవన వ్యవస్థను, దేశ గ్రామీణ ఆర్థిక ప్రగతిని అతలాకుతలం చేయడంలో ఎల్‌నినో పాత్ర అత్యంత కీలకంగా మారుతోంది.

శాస్త్రీయంగా పరిశీలిస్తే “ఎల్‌నినో” అనే పదం స్పానిష్ భాష నుండి ఉద్భవించింది. స్పానిష్ భాషలో దీనికి “దివ్య శిశువు” లేదా “బాల యేసు” అనే పవిత్రమైన అర్థం ఉంది. దక్షిణ అమెరికా ఖండంలోని పెరూ, ఈక్వెడార్ దేశాల పశ్చిమ తీర ప్రాంతాల్లో నివసించే స్థానిక మత్స్యకారులు శతాబ్దాల క్రితమే ఈ వింతను గుర్తించారు. సాధారణంగా ప్రతి రెండు నుండి ఏడేళ్లకు ఒకసారి, డిసెంబర్ మాసం లో అంటే క్రిస్మస్ పండుగ వచ్చే సమయానికి పసిఫిక్ మహాసముద్ర తీర జలాలు అసాధారణంగా వేడెక్కడాన్ని వారు గమనించారు. బాల ఏసు పుట్టిన కాలంలో ఈ మార్పు వస్తుంది కాబట్టి దీనికి ఎల్‌నినో అని నామకరణం చేశారు. సాధారణ పర్యావరణ పరిస్తితులలో పసిఫిక్ మహాసముద్రం పశ్చిమ భాగంలో అంటే ఆస్ట్రేలియా, ఇండోనేషియా వైపు వెచ్చని నీరు నిల్వ ఉంటుంది, తూర్పు పసిఫిక్ భాగంలో అంటే దక్షిణ అమెరికా తీరం వైపు చల్లని నీరు పైకి ప్రవహిస్తుంది. దీనిని హంబోల్ట్ లేదా పెరూ కరెంట్ అంటారు. అయితే ఎల్‌నినో సంభవించిన కాలంలో పసిఫిక్ సముద్రంపై తూర్పు నుండి పడమర వైపు వీచే వాణిజ్య పవనాలు బాగా బలహీన పడతాయి. దీనివల్ల పశ్చిమ పసిఫిక్‌లోని వెచ్చని జలాలు వెనక్కి కదిలి, మధ్య మరియు తూర్పు పసిఫిక్ మహాసముద్ర ఉపరితలానికి విస్తరిస్తాయి. ఇలా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణ సగటు కంటే కనీసం 0.5 డిగ్రీల సెల్సియస్ నుండి 2 నుండి 3 డిగ్రీల సెల్సియస్ వరకు అంతకంటే ఎక్కువగా పెరిగిపోతాయి. ఈ ఉష్ణోగ్రతల పెరుగుదల కేవలం కొన్ని రోజులు కాకుండా దాదాపు తొమ్మిది నుండి పద్దెనిమిది నెలల పాటు సుదీర్ఘంగా కొనసాగుతూ వాతావరణ చక్రాలను శాసిస్తుంది.

వాతావరణ శాస్త్రంలో ఎల్‌నినో అనేది విడిగా జరిగే ప్రక్రియ కాదు, ఇది “ఎల్‌నినో-సదరన్ ఆసిలేషన్” అనే ఒక బృహత్తర సముద్ర-వాతావరణ పీడన వ్యవస్థలో అంతర్భాగం. పసిఫిక్ సముద్ర జలాల ఉష్ణోగ్రతలకు, వాతావరణంలో ఏర్పడే గాలి పీడన మార్పులకు అంటే సదరన్ ఆసిలేషన్‌కు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని ఇది సూచిస్తుంది. దీనికి పూర్తిగా వ్యతిరేకమైన వాతావరణ పరిస్థితిని “లా నినా” అని పిలుస్తారు, స్పానిష్‌లో దీని అర్థం ‘చిన్నారి అమ్మాయి’. లా నినా కాలంలో వాణిజ్య పవనాలు మరింత బలాన్ని పుంజుకుని, తూర్పు పసిఫిక్ సముద్ర జలాలను సాధారణం కంటే విపరీతంగా చల్లబరుస్తాయి. దీని ఫలితంగా ఆస్ట్రేలియా, ఆసియా ఖండాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవిస్తాయి. ఈ విధంగా ఎల్‌నినో, లా నినా మరియు తటస్థ పరిస్థితులు ఒకదాని తర్వాత ఒకటి చక్రాకారంలో మారుతూ ప్రపంచ వాతావరణ సమతుల్యతను నిరంతరం ప్రభావితం చేస్తుం టాయి. ఈ చక్రం ఒక క్రమ పద్ధతిలో రానప్పటికీ, మానవ నిర్మిత కాలుష్యం కారణంగా దీని పునరావృత వేగం పెరుగుతోందని పర్యా వరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భారతదేశాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఇక్కడి వ్యవసాయ రంగానికి, వందల కోట్ల ప్రజల జీవన ప్రమాణాలకు నైరుతి రుతుపవనాలే ప్రధాన ఆధారం. మన దేశ వార్షిక వర్షపాతంలో సింహభాగం, అంటే సుమారు 70 నుండి 75 శాతం వర్షాలు కేవలం జూన్ నుండి సెప్టెంబర్ మధ్య కురిసే నైరుతి రుతుపవనాల ద్వారానే లభిస్తాయి. దేశంలోని సగానికి పైగా నికర సాగు భూమి ఇప్పటికీ ఈ వర్షాలపైనే ఆధారపడి ఉంది. జలాశయాల నిండడం, భూగర్భ జలాల పునరుద్ధరణ, తాగునీటి సరఫరా, జలవిద్యుత్ ఉత్పత్తి, గ్రామీణ మార్కెట్లలో కొనుగోలు శక్తి అన్నీ ఈ నాలుగు నెలల వర్షాలపైనే ముడిపడి ఉంటాయి. ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడినప్పుడు భూమధ్యరేఖ ప్రాంతంలో వాతావరణ పవనాల గమనం మారిపోతుంది. దీనివల్ల హిందూ మహాసముద్రం నుండి భారతదేశం వైపు రావాల్సిన తేమతో కూడిన రుతుపవన గాలులు బలహీనపడతాయి. పసిఫిక్ సముద్రంలోని అల్పపీడన కేంద్రాలు రుతుపవన మేఘాలను తమ వైపుకు ఆకర్షించడం వల్ల భారతదేశంలో వర్షపాతం తీవ్రంగా క్షీణిస్తుంది. రుతుపవనాలు ఆలస్యంగా రావడం, వచ్చిన తర్వాత సుదీర్ఘ కాలం పాటు వర్షాలు పడకుండా పొడి వాతావరణం ఏర్పడటం, సకాలంలో పంటలు వేయలేక పోవడం వంటి నష్టాలు సంభవిస్తాయి.

భారతదేశ వాతావరణ చరిత్రను, గత రెండు శతాబ్దాల గణాంకాలను లోతుగా విశ్లేషిస్తే, దేశంలో సంభవించిన ఘోరమైన కరవులకు, ఎల్‌నినో సంవత్సరాలకు మధ్య అత్యంత స్పష్టమైన, విడదీయరాని సంబంధం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు నిరూపిం చారు. గడచిన 150 ఏళ్ల కాలంలో దేశంలో సంభవించిన పెద్ద కరవులలో దాదాపు 80 శాతానికి పైగా ఎల్‌నినో ప్రభావం వల్లనే జరిగాయి. చారిత్రాత్మకంగా చూస్తే 1877, 1899, 1918, 1965, 1972, 1982, 1987, 2002, 2009, 2015, ఆ తర్వాత 2023-24లలో ఎల్‌నినో తీవ్ర రూపం దాల్చింది. బ్రిటీష్ పాలనలో 1877లో వచ్చిన ఎల్‌నినో వల్ల ‘మహా కరవు’ ఏర్పడి దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఆకలితో ప్రాణాలు కోల్పోయారు. అలాగే 1918 నాటి ఎల్‌నినో కాలంలో దేశంలో వర్షపాతం ఏకంగా 25 శాతం మేర పడిపోయి ఆహార సంక్షోభం తలెత్తింది. ఆధునిక కాలంలో 2002 వ సంవత్సరంలో ఏర్పడిన ఎల్‌నినో వల్ల దేశవ్యాప్తంగా నైరుతి వర్షపాతంలో దాదాపు 19 శాతం లోటు నమోదైంది, ఇది దశాబ్ద కాలంలోనే అత్యంత ఘోరమైన కరవుకు దారితీసింది. మళ్లీ 2009లో ఎల్‌నినో సృష్టించిన బీభత్సం వల్ల వర్షపాతం 22 శాతం తగ్గి, దేశంలోని సగానికి పైగా జిల్లాలను కరవు పీడిత ప్రాంతాలుగా ప్రకటించాల్సి వచ్చింది. 2015లో నమోదైన బలమైన ఎల్‌నినో వల్ల మహారాష్ట్రలోని మరఠ్వాడ, బుందేల్‌ఖండ్ వంటి ప్రాంతాల్లో తాగునీటికి కూడా హాహాకారాలు వ్యక్తమయ్యాయి. ఇటీవలి కాలంలో కూడా ఎల్‌నినో కారణంగా దేశంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరి, శీతాకాలం నిడివి తగ్గిపోవడం మనం గమనించాం.


ఈ ప్రక్రియ కేవలం భారత ఉపఖండానికే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్త వాతావరణాన్ని అతలాకుతలం చేస్తుంది. ఎల్‌నినో క్రియాశీలంగా ఉన్నప్పుడు పసిఫిక్ మహాసముద్రానికి తూర్పున ఉన్న దక్షిణ అమెరికా పశ్చిమ తీర దేశాలైన పెరూ, ఈక్వెడార్, చిలీలలో సాధారణంగా పొడిగా ఉండే ఎడారి ప్రాంతాలలో అసాధా రణంగా మేఘమథనం జరిగి అత్యంత భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం సంభవిస్తాయి. దీనికి భిన్నం గా పశ్చిమ పసిఫిక్ సరిహద్దుల్లో ఉన్న ఆస్ట్రేలియా, ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్, థాయిలాండ్ వంటి దేశాలలో తీవ్రమైన అనావృష్టి ఏర్పడుతుంది. ఆస్ట్రేలియాలోని అడవుల్లో కార్చిచ్చు రేగి వేలాది ఎకరాల వనసంపద, వన్యప్రాణులు బూడిదవుతాయి. ఆఫ్రికా ఖండంలోని హార్న్ ఆఫ్ ఆఫ్రికా అంటే ఇథియోపియా, సోమాలియా వంటి ప్రాంతాల్లో వర్షాలు లేక పశుగ్రాసం నశించి, పశువులు విచ్చలవిడిగా మరణిస్తాయి మరియు మానవ జీవనానికి తీవ్ర ఆహార కొరత ఏర్పడుతుంది. అదే సమయంలో బ్రెజిల్, కొలంబియా వంటి అమెజాన్ అడవుల పరిసర ప్రాంతాలలో కరువు పరిస్థితులు ఉంటే, అమెరికా సంయుక్త రాష్ట్రాల దక్షిణ భాగంలో శీతాకాలంలో చలి గాలుల తీవ్రత పెరిగి, భారీ వర్షపాతం నమోదవుతుంది.

వాతావరణ మార్పులతో పాటు సముద్ర జీవవైవిధ్యం, జల పర్యావరణ వ్యవస్థలపై ఎల్‌నినో దెబ్బ అత్యంత ఘోరంగా ఉంటుంది. పెరూ తీర ప్రాంతం ప్రపంచంలోనే అతిపెద్ద మత్స్య సంపద కేంద్రాలలో ఒకటి. సాధారణ రోజుల్లో ఇక్కడ ‘అప్‌వెల్లింగ్’ అనే ప్రక్రియ ద్వారా సముద్రపు అడుగుభాగం నుండి పోషకాలతో కూడిన చల్లని నీరు పైకి వస్తుంది. ఈ పోషకాలను తిని బతికే ‘ప్లాంక్టన్’ అనే సూక్ష్మజీవులు, వాటిపై ఆధారపడే ‘ఎంకోవి’ వంటి చిన్న చేపలు ఇక్కడ కోట్లాదిగా వృద్ధి చెందుతాయి. కానీ ఎల్‌నినో వల్ల వెచ్చని నీరు వచ్చి చేరడంతో ఈ అప్‌వెల్లింగ్ ప్రక్రియ పూర్తిగా ఆగిపోతుంది. నీటిలో పోషకాలు లేక, వేడిని తట్టుకోలేక చేపలు చనిపోవడం లేదా వేరే ప్రాంతాలకు వలస పోవడం జరుగుతుంది. ఇది పెరూ దేశపు ఆర్థిక వ్యవస్థను, మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీస్తుంది. మరోవైపు, సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదల వల్ల సముద్ర అంతర్భాగంలోని పగడపు దిబ్బలు తమ రంగును, జీవాన్ని కోల్పోయి చనిపోతాయి. దీనినే ‘కోరల్ బ్లీచింగ్’ అంటారు. ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన ఆస్ట్రేలియా ‘గ్రేట్ బారియర్ రీఫ్’ ఎల్‌నినో కాలంలోనే అత్యధికంగా నష్టపోయిందని పర్యావరణ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

మానవ సమాజానికి అత్యంత హాని కలిగించే అంశం వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థలపై ఎల్‌నినో వల్ల రుతుపవనాలు వైఫల్యం చెందితే, ఆసియా ఖండంలో ప్రధాన ఆహార పంటలైన వరి, మొక్కజొన్న, సోయాబీన్, చెరకు, పత్తి, నూనెగింజల సాగు తీవ్రంగా దెబ్బతింటుంది. నీటి కొరత వల్ల సాగు విస్తీర్ణం తగ్గిపోతుంది. రైతులు పంటలను కాపాడు కోవడానికి భూగర్భ జలాలను విపరీతంగా తోడటం వల్ల భూగర్భ జలమట్టాలు పాతాళానికి పడిపోతాయి. ఆహార ధాన్యాల దిగుబడి తగ్గడం మార్కెట్లో డిమాండ్ మరియు సప్లై మధ్య సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఫలితంగా నిత్యావసర వస్తువుల, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతాయి, ఇది దేశ ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు సన్నగిల్లి, ప్రజల కొనుగోలు శక్తి క్షీణించి, పారిశ్రామిక ఉత్పత్తుల అమ్మకాలు కూడా పడిపోతాయి. అంటే గ్రామీణ పొలాల్లో ప్రారంభమయ్యే ఎల్‌నినో సంక్షోభం, దేశ జీడీపీ వృద్ధి రేటును తగ్గించేంత శక్తివంతంగా మారుతుంది.

ప్రస్తుత ఆధునిక కాలంలో గ్లోబల్ వార్మింగ్ లేదా భూతాపం తీవ్రత పెరగడం వల్ల ఎల్‌నినో ప్రవర్తన మరింత సంక్లిష్టంగా, అనూహ్యంగా మారుతోందని అంతర్జాతీయ వాతావరణ పరిశోధకులు మరియు ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. శిలాజ ఇంధనాల వాడకం, అడవుల నరికివేత, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాల వల్ల భూగోళంతో పాటు సముద్రాలు కూడా వేడెక్కుతున్నాయి. ఈ అదనపు వేడి పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ఏర్పడే ఫ్రీక్వెన్సీని, దాని తీవ్రతను పెంచుతోంది. ఒకప్పుడు ప్రతి 5 నుండి 7 సంవత్సరాలకు ఒకసారి వచ్చే తీవ్ర ఎల్‌నినో, ఇప్పుడు ప్రతి 2 నుండి 3 సంవత్సరాలకే సంభవిస్తోంది. కొన్ని అత్యాధునిక కంప్యూటర్ నమూనాల అంచనాల ప్రకారం, ఈ శతాబ్దం చివరి నాటికి ‘సూపర్ ఎల్‌నినో’ వంటి వినాశకరమైన వాతావరణ సంఘటనల సంఖ్య రెట్టింపు అయ్యే ప్రమాదం ఉంది. వాతావరణ మార్పు మరియు ఎల్ నినోల కలయిక వల్ల రాబోయే 2027 సంవత్సరం భూగోళ చరిత్రలోనే అత్యంత వేడి సంవత్సరంగా మారొచ్చని అంతర్జాతీయ పరిశోధనలు ముందే హెచ్చరిస్తున్నాయి.

ఈ విపత్కర పరిస్థితులను ముందే ఊహించి నష్టాన్ని తగ్గించడానికి అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో వాతావరణ శాస్త్ర పరిశోధనలు వేగవంతమయ్యాయి. ప్రపంచ వాతావరణ సంస్థ తో పాటు భారతదేశంలోని భారత వాతావరణ శాఖ వంటి సంస్థలు ఆధునిక ఉపగ్రహాలు, సముద్ర ఉపరితలంపై అమర్చిన బాయ్‌లు, రాడార్







వ్యవస్థలు మరియు సూపర్ కంప్యూటర్ డైనమిక్ మోడల్స్ ద్వారా ఎల్‌నినో రాకను 6 నుండి 9 నెలల ముందే అంచనా వేస్తున్నాయి. ఈ ముందస్తు హెచ్చరికలు ప్రభుత్వాలకు విపత్తు నిర్వహణ ప్రణాళికలు రూపొందించుకోవడానికి, రైతులకు తగిన సలహాలు ఇవ్వడానికి అమూల్యమైన సమయాన్ని అందిస్తున్నాయి. ముందస్తు సమాచారం లభించినప్పుడు దేశాలు తమ ఆహార నిల్వలను, నీటి వనరులను ముందే ప్రణాళికాబద్ధంగా మేనేజ్ చేసుకునే అవకాశం కలుగుతుంది.

ఈ క్రమంలోనే ప్రస్తుత 2026 సంవత్సరానికి సంబంధించిన ముందస్తు అంచనాలు దేశాన్ని కలవరపెడుతున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న సూపర్ ఎల్-నినో ప్రభావం ప్రస్తుత 2026 నైరుతి రుతుపవనాలపై జూలై నెల నుంచి స్పష్టంగా కనిపించడం ప్రారంభమవుతుందని నిపుణులు గట్టిగా అంచనా వేస్తున్నారు. జూన్ ఒకటవ తేదీన ఎప్పటిలాగే కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు దేశ అంతర్భాగంలోకి ముందుకు కదలడంలో తీవ్రమైన ఇబ్బందులు, ఆటంకాలు తలెత్తే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా జూలై మాసంలో ఉత్తర, మధ్య, పశ్చిమ భారతదేశ ప్రాంతాలలో వర్షపాతంలో భారీ లోటు వచ్చే అవకాశా లు చాలా ఎక్కువగా ఉన్నాయి. దీనివల్ల దేశానికి అన్నపూర్ణలుగా నిలిచే పంజాబ్, హర్యానాతో పాటు దేశ రాజధాని ప్రాంతమైన ఢిల్లీలలో తీవ్రమైన కరవు పరిస్థితులు రావచ్చునని వాతావరణ మోడల్స్ సూచిస్తున్నాయి. అదేవిధంగా పారిశ్రామిక, వ్యవసాయ ప్రాధాన్యమున్న మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ లలో కూడా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే ప్రమాదం ఉంది.

అయితే, అత్యంత ఆసక్తికరంగా మరియు ఆందోళనకరంగా జూలై-ఆగస్టు నెలల్లో దక్షిణాది రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో విపరీతమైన అకాల వర్షాలు కురిసి హఠాత్తుగా వరదలు రావచ్చునని తాజా అంచనాలు చెబుతున్నాయి. ఈ వాతావరణ వైపరీత్యం మరింత ముదిరి సెప్టెంబరు మాసంలో ముఖ్యంగా చెన్నై మహానగరంతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సముద్ర తీర ప్రాంతాల్లో తీవ్రమైన సమస్యలను తెచ్చిపెట్టవచ్చునని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పరిస్థితులు గనుక ఇదే రీతిన కొనసాగితే, ఈ సూపర్ ఎల్-నినో వినాశకర ప్రభావం కారణంగా తదుపరి వచ్చే 2026-27 రబీ సీజన్ పంటల సాగుపై కూడా తీవ్రమైన వ్యతిరేక ప్రభావం పడుతుంది, ఇది దేశ ఆహార లభ్యతను ప్రశ్నార్థకం చేయవచ్చు.

భారతదేశం లాంటి భారీ జనాభా, వ్యవసాయ ఆధారిత వ్యవస్థ కలిగిన దేశం ఎల్‌నినో సవాళ్లను తట్టుకోవాలంటే కేవలం వాతావరణ అంచనాలపైనే కాకుండా క్షేత్రస్థాయిలో నిర్మాణాత్మక ముందస్తు వ్యూహాలపై దృష్టి పెట్టాలి. వర్షపాతం తగ్గుతుందనే సంకేతాలు ఉన్నప్పుడు జల సంరక్షణ పద్ధతులను యుద్ధప్రాతి పదికన చేపట్టాలి. సాంప్రదాయ చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకించే ‘వాటర్ హార్వెస్టింగ్’ పద్ధతులను విస్తృతంగా అమలు చేయాలి. వ్యవసాయం లో సాంప్రదాయ పద్ధతుల నుండి మారి తక్కువ నీటితో ఎక్కువ దిగుబడినిచ్చే డ్రిప్ సేద్యం, స్ప్రింక్లర్ నీటిపారుదల వంటి సూక్ష్మ నీటిపారుదల సాంకేతికతను ప్రోత్సహించాలి. అలాగే, కరువును, అధిక వేడిని తట్టుకుని నిలబడగలిగే స్వల్పకాలిక పంట రకాలను, ప్రత్యామ్నాయ విత్తనాలను రైతులకు సకాలంలో అందు బాటులో ఉంచాలి. నీటి వినియోగం ఎక్కువగా ఉండే వరి, చెరకు వంటి పంటలకు బదులుగా తక్కువ నీటితో పండే తృణధాన్యాలు, పప్పు ధాన్యాల వైపు పంటల వైవిధ్యీకరణ వైపు రైతాంగాన్ని మళ్లించాలి.

భారతదేశం వంటి దేశాలలో ఎల్‌నినో అనేది కేవలం పసిఫిక్ మహాసముద్రంలో జరిగే ఒక సాధారణ భౌతిక మార్పు మాత్రమే కాదు; అది దేశ ఆర్థిక, సామాజిక, పర్యావరణ రంగాల భవితవ్యాన్ని మార్చే ఒక సంక్లిష్ట శక్తి. ప్రకృతి ప్రసాదించే సంకేతాలను శాస్త్రీయ దృక్పథంతో నిరంతరం గమనిస్తూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ముందస్తు రక్షణ చర్యలు చేపట్టినప్పుడే మనం ఈ సవాళ్లను అధిగమించగలం. స్థిరమైన నీటి వనరుల నిర్వహణ, పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులు, అడవుల పెంపకం మరియు పటిష్టమైన ప్రభుత్వ విధానాల కలయిక ద్వారానే ఎల్‌నినో తెచ్చే కరువుల తీవ్రతను తగ్గించి, దేశ ఆహార భద్రతను, జల భద్రతను, ఆర్థిక స్థిరత్వాన్ని భవిష్యత్ తరాల కోసం సురక్షితంగా కాపాడుకోగలము. ప్రకృతి సంకేతాలను గమనిస్తూ శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగినప్పుడే వాతావరణ సవాళ్లను అధిగమించి ఆహార భద్రత, జల భద్రత, పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం సాధ్యమవుతుంది.

వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.

# కాంగ్రెస్‌లో కుటుంబ కలహాలు: ఆసిఫాబాద్ జిల్లాలో వర్గపోరుతో కార్యకర్తల విలవిల!




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూన్ 4 : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో సరికొత్త రాజకీయ సమీకరణాలు మొదలయ్యాయి. ఒకవైపు పార్టీలోకి భారీగా చేరికలు పెరుగుతుంటే, మరోవైపు అంతే స్థాయిలో అంతర్గత విభేదాలు భగ్గుమంటున్నాయి. ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ పరిస్థితి చూస్తుంటే.. సొంత ఆస్తుల కోసం ఒకే కుటుంబంలోని అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు కొట్లాడుకుంటున్నట్లు ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ?జిల్లాలో పార్టీ పట్టు సాధించడం పక్కన పెడితే, నేతల మధ్య వర్గపోరు పతాక స్థాయికి చేరింది. ఒకరిని మించి మరొకరు అన్నట్లుగా ఎత్తులకు పైఎత్తులు వేస్తూ రాజకీయాలు నడుపుతున్నారు. "ఎవరికి వారే.. యమునా నారే" అన్న చందంగా జిల్లా నాయకత్వం వ్యవహరిస్తుండటంతో క్షేత్రస్థాయిలో పార్టీ తీవ్రంగా నష్టపోతోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నాయకులు ప్రజల సమస్యలను పక్కనబెట్టి, తమ స్వంత స్వార్థ ప్రయోజనాల కోసమే పాకులాడుతున్నారని ముఖ్య కార్యకర్తలు, పార్టీ అభిమానులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిన్నటివరకు ఏకతాటిపై నడిచిన పార్టీ, నేడు ముక్కలు ముక్కలుగా విచ్ఛిన్నం కావడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. జిల్లాలో కాంగ్రెస్ జెండా మోసే సాధారణ కార్యకర్తలు ఎటు వెళ్లాలో తెలియక తీవ్ర సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఏ నాయకుడి వైపు వెళ్లినా కాంగ్రెస్ పార్టీయే అయినప్పటికీ.. ఇక్కడున్న అంతర్గత వర్గాల వల్ల ఒకరిని ఆశ్రయిస్తే మరొకరికి శత్రువులుగా మారిపోవాల్సి వస్తోందని క్షేత్రస్థాయి కార్యకర్తలు అంతర్గతంగా మథనపడుతున్నారు. నాయకుల ఈ వర్గపోరు వల్ల సాధారణ కార్యకర్తలు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేయగలిగే సమర్థుడైన నాయకుడు ఎవరో అధిష్ఠానమే స్వయంగా గుర్తించి ప్రకటించాలని కోరుతున్నారు. హైకమాండ్ ఇచ్చే ఆదేశాల ప్రకారం, పార్టీ కట్టుబాట్లకు లోబడి పనిచేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఈ అంతర్గత గందరగోళానికి త్వరలోనే తెరదించాలని కార్యకర్తలు వేడుకుంటున్నారు.

# ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

**- ఖని ఆర్టీసి బస్టాండ్ ఆధునీకరణ - రూ.20 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన -రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటీ (గోదావరిఖని), జూన్ 4 : గోదావరిఖని పట్టణంలో ఆర్టీసి బస్టాండ్ ఆధునీకరణ పనులకు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గురువారం శంకుస్థాపన చేశారు. దాదాపు రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న బస్టాండ్ రెనోవేషన్ పనుల్లో భాగంగా సి.సి. రోడ్డు విస్తరణ, ప్లాట్‌ఫామ్ మరమ్మతులు, సానిటరీ పైప్‌లైన్‌ల ఏర్పాటు, బస్టాండ్ ఆవరణలో పెయింటింగ్ పనులు తదితర అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా బస్టాండ్ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బస్టాండ్‌కు వచ్చే వేలాది మంది ప్రయాణికులకు ఈ పనులు పూర్తయిన తర్వాత మరింత సౌకర్యవంతమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. అనంతరం బస్టాండ్ ఆవరణను పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, ప్రయాణికులకు ఇబ్బందిగా బస్టాండ్ లోపల,ఆవరణలో వాహనాలను పార్కింగ్ చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బస్టాండ్ పరిసరాలు పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్‌ను ఆదేశించారు. ప్రయాణికుల రాకపోకలకు ఆటంకం కలగకుండా చూడాలని, బస్టాండ్ చుట్టూ ఎలాంటి అవ్యవస్థకు తావులేకుండా నిర్వహణ చేపట్టాలని సూచిస్తూ డిపో మేనేజర్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొంతల రాజేష్, 36వ డివిజన్ కార్పొరేటర్ కల్వల పద్మావతి--రంజిత్, కార్పొరేటర్లు గడ్డం రమాదేవి--శ్రీనివాస్, నెలకంటి రాము, దూళికట్ట సతీష్, తాళ్లపల్లి యుగంధర్, చిరురాల నాగరాజు, చుక్కల లావణ్య-శ్రీనివాస్, కర్రావుల దేవిడ్ రాజు, డిపో మేనేజర్, ఆర్టీసీ సిబ్బంది, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# రసాబాసాగా మారిన మహబూబాబాద్ మున్సిపల్ సమావేశం

**- మీడియాకు అనుమతి నిరాకరణపై సీపీఐ, బీఆర్ఎస్ కౌన్సిలర్ల నిరసన**

**- రూ.59 కోట్ల నిధులు, అభివృద్ధి పనులపై అధికార పక్షాన్ని నిలదీత**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, జూన్ 04: మహబూబాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం వాగ్వాదాలు, నిరసనల మధ్య రసాభాసగా మారింది. సమావేశానికి మీడియా ప్రతినిధులను అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ సీపీఐ, బీఆర్ఎస్ కౌన్సిలర్లు పోడియం వద్దకు వెళ్లి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు సంబంధించిన అంశాలపై చర్చించే కౌన్సిల్ సమావేశాలకు మీడియాను అనుమతించాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో రూ. 59 కోట్ల అభివృద్ధి నిధులు, వార్డుల వారీగా చేపట్టాల్సిన పనులపై ప్రతిపక్ష కౌన్సిలర్లు అధికార పక్షాన్ని నిలదీశారు. ప్రతి వార్డుకు రూ. 50 లక్షల చొప్పున అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అధికార పక్షం పేర్కొనగా, ఏయే వార్డుల్లో ఆ పనులు చేపట్టారో వివరాలు వెల్లడించాలని సీపీఐ,బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ అన్ని వార్డులకు సమానంగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్ సారథిరెడ్డి మాట్లాడుతూ 33వ వార్డులో నిర్మించిన నూతన సమీకృత కూరగాయల మార్కెట్‌ను వెంటనే వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. పలుమార్లు ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ మార్కెట్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడం బాధాకరమన్నారు. గాంధీ పార్క్‌ను ప్రజలకు అందుబాటులోకి తేవాలని, ఓసీ క్లబ్‌ను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని ప్రజాప్రయోజనాలకు వినియోగించాలని కోరారు. పత్తిపాక రోడ్డు, ఏ క్యాబిన్ రూట్ రోడ్డు, కంకరబోర్డ్ ప్రధాన రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కంకరబోర్డ్ ప్రాంతంలో మిషన్ భగీరథ ట్యాంకును ప్రారంభించి ప్రజలకు తాగునీరు అందించాలని కోరారు. 18వ వార్డు కౌన్సిలర్ రేశపల్లి నవీన్ మాట్లాడుతూ వార్డులో స్మశానవాటికల అభివృద్ధి, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. 25వ వార్డు కౌన్సిలర్ నర్రా సంధ్యా శ్రావణ్ మాట్లాడుతూ జగన్ కాలనీలోని బావిని అభివృద్ధి చేసి మంచినీటి సమస్యను పరిష్కరించాలని, వార్డు అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం, ఇంకుడు గుంతల ఏర్పాటు అవసరం

**- ప్రత్యేక గ్రామసభలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, జూన్ 4 : పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడంతో పాటు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం ఖిల్లా ఘనపూర్ మండలం పర్వతపురం రైతువేదికలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు రోడ్డు భద్రత, బాల్యవివాహాల నిర్మూలన, వర్షాకాలంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, వనమహోత్సవం, జల సంరక్షణ, పాఠశాలల్లో సౌకర్యాలు తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. బాలికలకు బాల్యవివాహాలు చేయకుండా ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇటీవల మంచి ఫలితాలు సాధించారని, అందువల్ల ప్రభుత్వ విద్యపై ప్రజలు విశ్వాసం ఉంచాలని అన్నారు. గ్రామాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తగ్గే అవకాశముందని వివరించారు. అలాగే ప్రభుత్వం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తున్నందున అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో గత ఐదేళ్లలో 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వ్యక్తులు మరణించినట్లయితే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద దరఖాస్తు చేసుకుని రూ.20 వేల ఆర్థిక సహాయం పొందవచ్చని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ గ్రామస్తులకు మొక్కలను పంపిణీ చేసి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ రఘునాథ్, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్థాయి సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : జిల్లా విద్యాధికారి రాము




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జూన్ 04 : ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని, వారి సేవల ద్వారానే ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. గురువారం భీమారం మండలంలోని రంగాపూర్ లో ఈనెల 03 నుండి 18 వరకు జరుగుతున్న జయశంకర్ బడిబాట ర్యాలీలో పాల్గొని అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యతో పాటు సంస్కారం నేర్పబడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఈ విద్యా సంవత్సరం ఉదయం అల్పాహారం అందించడం జరుగుతుందని, అదేవిధంగా 09 రకాల వస్తువులతో కూడిన కిట్లు కూడా అందించబడతాయని, జిల్లాలో ఈ సంవత్సరం కొత్తగా 26 ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం బాసర ట్రిబుల్ ఐటీలో 126 మంది విద్యార్థులకు సీట్లు సాధించడం జరిగిందని, నేడు సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న వారందరూ ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారేనని అన్నారు. గ్రామ ప్రజలు అందరు సహకరించి విద్యార్థులందరిని ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు బహుముఖ ప్రజ్ఞాశాలుగా తీర్చిదిద్దబడతారని వారన్నారు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్చి ప్రభుత్వ పాఠశాలను బలోపితం చేయాలని కోరారు. అనంతరం బాసర ట్రిబుల్ ఐటీ లో సీట్ సాధించిన విద్యార్థిని, గత విద్యా సంవత్సరం 10,వ తరగతిలో 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. అనంతరం విద్యార్థులకు పిఆర్టియు టిఎస్ సంఘం సహకారంతో విద్యార్థులకు స్పోర్ట్స్ మెటీరియలను అందజేశారు. అనంతరం ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. జిల్లా విద్యాధికారిని గ్రామ ప్రజలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మకిలి కావేరి కుమార్, మండల విద్యాధికారి మధుసూదన్ రెడ్డి, పిఆర్టియు టిఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయిని పెల్లి ఆనంద్ రావు యాల్ల అమర్నాథ్ రెడ్డి ఉప సర్పంచ్ బోయిని పెల్లి రాంమోహన్ రావు మేడిపల్లి మండల విద్యాధికారి లక్ష్మి నరసయ్య, స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ వెంకట్ రమణ పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వప్న సిఆర్పి బర్ల నారాయణ ఉపాధ్యాయులు వార్డు సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులకు అక్రిడేషన్ కార్డులు

**అందజేసిన భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 4 : భద్రాద్రి జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులకు జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో అక్రిడేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను అభినందించిన కలెక్టర్, మీడియా ప్రతినిధులు ప్రజలకు సమాచారాన్ని చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల అక్రిడేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. అర్హులైన మీడియా ప్రతినిధులకు శుక్రవారం నుండి జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో అక్రిడేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. సంబంధిత మీడియా ప్రతినిధులు నిర్ణీత సమయంలో కార్యాలయానికి వచ్చి తమ అక్రిడేషన్ కార్డులను స్వీకరించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా ఒక ముఖ్యమైన స్తంభమని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంతో పాటు ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టులు విశేష సేవలు అందిస్తున్నారని కలెక్టర్ అన్నారు. మీడియా ప్రతినిధులు తమ వృత్తి నిబద్ధతను కొనసాగిస్తూ ప్రజలకు నిష్పాక్షిక సమాచారాన్ని అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార మరియు పౌర సంబంధాల అధికారి అజ్గర్ హుస్సేన్, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు, సమాచార, పౌర సంబంధాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.




# ఘనంగా రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలల ఫేర్వెల్ పార్టీ వేడుకలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జూన్ 04 : కోరుట్ల పట్టణంలోని కటుకం సంఘయ్య ఫంక్షన్ హాల్ లో గురువారం కోరుట్ల రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలల ఫేర్వెల్ పార్టీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామకృష్ణ డిగ్రీ కళాశాలల సంస్థ గ్రూప్ ఆఫ్ చైర్మన్ యాద రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. నిరంతర సాధనే విద్యార్థుల విజయానికి తొలిమెట్టు అని అన్నారు. క్రమశిక్షణగా ఉంటూ ఉన్నత విద్యను చదివి సమాజంలో మార్పు తీసుకు రావాలని పిలుపునిచ్చారు. ఉన్నత చదువులతో ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రాణించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గాడిపెల్లి అంజయ్య, హరిప్రియ, ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, జూన్ 4 : ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ములుగు జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ వాసుదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడ్వాయి మండలం పోచాపూర్ గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో బిట్టుపల్లి, బంధాల,పోచాపూర్, నర్సాపూర్ పిఎల్,బోల్లెపల్లి గ్రామాల ప్రజలకు శుక్రవారం ఉదయం 9:00 గంటలకు, లింగాల గ్రామంలోని గ్రామపంచాయతీలో ఒడ్డుగూడెం, అల్లిగూడెం,లింగాల,బోటి లింగాల,లవ్వల గ్రామాల ప్రజలకు 10:00 గంటలకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కార మార్గం చూపడానికి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సమక్షంలో తాడ్వాయి మండలంలోని పోచపూర్, లింగాల గ్రామాలలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, రెండు గ్రామాల పరిధిలోని ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ, డీఎఫ్ఓ,అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఆర్డీఓ,అన్ని శాఖల జిల్లా అధికారులు,అన్ని శాఖల ఇంజనీరింగ్ ఉన్నత అధికారులు,సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు,ఎంపీఓలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

# నిబద్ధతతో పనిచేస్తేనే బాధ్యతలు..

**కాంగ్రెస్ పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు వంగ రవి యాదవ్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, జూన్ 4 : కాంగ్రెస్ పార్టీలో నిబద్ధతతో పనిచేసిన ప్రతి కార్యకర్తకు పార్టీలో పదవులు వస్తాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్ అన్నారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయం లో కాంగ్రెస్ పార్టీ ములుగు పట్టణ ముఖ్య నాయకుల సమావేశం మాజీ పట్టణ అధ్యక్షుడు చింత నిప్పుల బిక్షపతి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా వంగ రవి యాదవ్ హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో పట్టణ అధ్యక్ష పదవి అంటే ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని,పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆధ్వర్యంలో ములుగు జిల్లా కేంద్రంలో అనేక రకాలైన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు,పార్టీ కార్యక్రమాలు జరుగుతాయని ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకుపోయి ప్రచారం చేయాలని,కార్యకర్తలకు ఎప్పుడు వెన్నుదండగా ఉండాలని పార్టీ అధ్యక్ష పదవి అంటే ప్రతి కార్యక్రమంలో ముందుండి నడిచే బాధ్యత అన్నారు. పట్టణ అధ్యక్షుడు బిక్షపతి సారథ్యంలో 2023 సార్వత్రిక ఎలక్షన్లో ములుగు పట్టణం నుండి సీతక్కకు మెజార్టీ వచ్చిందని,మున్సిపల్ ఎన్నికలలో చింత నిప్పుల బిక్షపతి సారథ్యంలో 12 వార్డులను కాంగ్రెస్ పార్టీ గెలుచుకోవడం జరిగిందని, బిక్షపతి పార్టీకి చేసిన సేవలను గుర్తించి మంత్రి సీతక్క చింత నిప్పుల బిక్షపతి సతీమణి చంద్రకళ కు ములుగు పట్టణ మహిళా చైర్మన్ గా అవకాశం కల్పించారని,పార్టీ కోసం పనిచేసిన వారికి కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు ఉంటుందని,ములుగు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి,కిసాన్ కాంగ్రెస్ ములుగు జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్,డిసిసి వైస్ ప్రెసిడెంట్ పల్లె జయపాల్ రెడ్డి,జిల్లా సీనియర్ నాయకులు షర్ఫుద్దీన్,యాసం రవికుమార్ జడ్పీ మాజీ కో ఆప్షన్ మెంబర్ రియాజ్ మీర్జా,ములుగు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్ కుమార్, కౌన్సిలర్లు పొడాల ఓం ప్రకాష్, గుంటోజు పావని,కుతుబొద్దిన్, పట్టణ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**అధికారులకు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, జూన్ 04 : బడిబాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎంపీడీవోలు, మండల విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న ఆధునిక విద్య, సౌకర్యాలు, నాణ్యమైన భోజనం, క్రీడా వసతులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. జూన్ 12న పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మన ఊరు-మనబడి, అమ్మ ఆదర్శ పాఠశాల పథకాల కింద చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేసే సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించాలని, అంగన్‌వాడీ కేంద్రాలు, సీడబ్ల్యూసీల్లోని బడి ఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాల వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలను కూడా పాఠశాలల ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ఆదేశించారు.



# మంగంపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

## - జన్మించిన ఊరి అభివృద్ధే నా లక్ష్యం
## -వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దమందడి, జూన్ 4 : ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఎమ్మెల్యే మేఘారెడ్డి పలు అభివృద్ధి కార్య క్రమాలను ప్రకటించారు. తన జన్మభూమి అయిన మంగం పల్లిని జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి మంగంపల్లిని పైలట్ గ్రామం గా ఎంపిక చేసి ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం తన వంతుగా రూ.10 లక్షలు కేటాయించడంతో పాటు, జిల్లా కలెక్టర్ సహకారంతో మరో రూ.10 లక్షలు మంజూరు చేయించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికి సోలార్ సదుపాయం కల్పించడం, ఇంకుడు గుంతల నిర్మాణం, మొక్కల పెంపకం, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి కార్యక్రమాల ద్వారా మంగంపల్లిని ఆదర్శ గ్రామంగా మార్చే దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేద్దాం

## - వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి పిలుపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, జూన్ 4 : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పిలుపునిచ్చారు. ప్రాజెక్టుల సందర్శనతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల నిమిత్తం ముఖ్యమంత్రి శుక్రవారం ఉమ్మడి పాలమూరు జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా, ఉద్దండపూర్‌లో సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి వనపర్తి నియోజకవర్గ పరిధిలోని వనపర్తి, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల, పట్టణ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, సింగిల్ విండో అధ్యక్షులు, డైరెక్టర్లు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విభాగాల ప్రతినిధులు, మహిళా కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ముఖ్యమంత్రి ప్రజలను ఉద్దేశించి మాట్లాడనున్న నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాప్రతి నిధులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి విజ్ఞప్తి చేశారు.



# ఇందిరా మహిళా శక్తి భవనాన్ని త్వరగా పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ కె.హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూన్ 4 : జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న జిల్లా మహిళా సమాఖ్య ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో 6 కోట్ల రూపాయల అంచనాలతో నిర్మిస్తున్న జిల్లా మహిళా సమాఖ్య ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, పంచాయతీరాజ్ కార్యనిర్వా హక ఇంజనీర్ ధ్యానేందర్ లతో కలిసి సందర్శించి పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులు, గుత్తేదారును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 6 కోట్ల రూపాయల అంచనాలతో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవనం నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి త్వరలో ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని తెలిపారు. భవనానికి రంగు, విద్యుత్ సంబంధించిన పనులు, కిటికీలు, దర్వాజాలు బిగించే పనులను వేగవంతం చేయాలని గుత్తేదారును ఆదేశించారు. భవన నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులు, భవన నిర్మాణ గుత్తేదారు, తదితరులు పాల్గొన్నారు.



# పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు బాధితులకు అందజేత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, జూన్ 04 : సెల్‌ఫోన్లు పోగొట్టుకుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులకు పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ గురువారం రికవరీ చేసిన 10 సెల్‌ఫోన్లను అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ,ఇప్పటివరకు పోలీస్ స్టేషన్‌లో 544 మంది బాధితులకు సెల్ ఫోన్లు అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక చర్యలు చేపట్టి సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో మొత్తం 553 ట్రేసాబిలిటీ చేసి 544సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు రికవరీ చేసిన చరవాణులను సంబంధిత బాధితులకు దశలవారీగా అప్పగిస్తున్నామని తెలిపారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా సీఈఐఆర్ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. పోగొట్టుకున్న ఫోన్లను గుర్తించి తిరిగి యజ మానులకు అప్పగించేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రికవరీ చేసిన తమ సెల్‌ఫోన్లను తిరిగి పొందిన బాధితులు పోలీసుల సేవలను అభినందిస్తూ,ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పోలీసు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# బడి బాట సమర్ధవంతంగా నిర్వహించాలి

## - ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి - జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, జూన్ 03 : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్లో విద్యాధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ఈవిద్యా సంవత్సరం మెరుగైన విద్యా ప్రమాణాల లక్ష్యంగా ముందుకు పోతూ బడి బాట సమర్ధవంతంగా నిర్వహించాలని,విద్యార్థుల తక్కువ నమోదు పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల నమోదు పెంచుటకై గ్రామంలోని ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలని, కనీస సామర్థ్యాలు అయినటువంటి చదవడం రాయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పాఠశాలల్లో ఏర్పాటు చేసే మౌలిక వసతుల గురించి తల్లిదండ్రులకు వివరించాలని, వీటి ఆధారంగానే పాఠశాలలకు ప్రగతి సూచికలు ఇవ్వబడతాయని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రీ ప్రైమరీ పాఠశాలలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అలాగే ఎఫ్ఆర్ఎస్,ఇతర అంశాలపై దృష్టి పెట్టి సరియగు చర్యలు గైకొనాలని సూచించారు. జిల్లాలోని భవిత కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలని, కొత్త ప్రీ ప్రైమరీ విభాగాలను ప్రారంభించాలని,విద్యార్థుల సంఖ్యలేని పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని, పాఠ్యపుస్తకాల పంపిణీ చేయాలని, స్వయం సహాయక బృందాల చేత పిల్లలకు యూనిఫామ్ కుట్టించాలని, నూతన టెక్నాలజీ ఏఐ, డిజిటల్ తరగతులను నిర్వహించాలని, విద్యాశాఖ బలోపేతానికి ప్రత్యేక కార్యచరణ ప్రకారం ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈకార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు,చీఫ్ మానిటరింగ్ ఆఫీసర్ రాజు, ఏఎంఓ సుదర్శన మూర్తి, నవీన్,తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి


## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జూన్ 03 : నిర్మల్ జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో మిగిలి ఉన్న వరి ధాన్యం సేకరణ ప్రక్రియను జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలు అంశంపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు జరిగిన ధాన్యం కొనుగోలు పురోగతి, మిగిలి ఉన్న ధాన్యం నిల్వలు, కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. తక్కువ పరిమాణంలో ధాన్యం మిగిలి ఉన్న కొనుగోలు కేంద్రాల్లో సేకరణను వేగవంతం చేసి, కొనుగోలు ప్రక్రియను పూర్తికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఇప్పటికే కొను గోళ్లు పూర్తయిన కేంద్రాల్లో అందుబాటులో ఉన్న లారీలు, హమాలీలను ధాన్యం నిల్వలు అధికంగా ఉన్న ఇతర కేంద్రాలకు తరలించి వినియోగించుకోవాలని సూచించారు. ధాన్యం సేకరణ, లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలో



ఎటువంటి అంతరాయం కలగకుండా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, డిఆర్డిఓ విజయలక్ష్మి, డీఎం మార్క్‌ఫెడ్ మహేష్, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# విశ్వకర్మ మహాసభ రాష్ట్ర కమిటీ లో వెంకటయ్యకు చోటు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూన్ 4 : అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని (జనకపూర్) కు చెందిన శ్రీరామోజు వెంకటయ్య చారి ని నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు నౌండ్ల సంతోష్ చారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటయ్య చారి తండ్రిగారైన శ్రీరామోజు రామయ్య చారి గత 50 సంవత్సరాలుగా సంఘానికి సేవలు అందించారని, 3సార్లు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులుగా ఉండి విశ్వబ్రాహ్మణ కుల బాంధవులకు, సంఘానికి ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి, సంఘానికి అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందించారని అన్నారు.ఆయన కుమారుడైన వెంకటయ్య చారి గత కొన్ని సంవత్సరాలుగా విశ్వబ్రాహ్మణ సంఘ సేవలో చురుకుగా పాల్గొంటున్నారని, అందుకే సముచితమైన బాధ్యతను అప్పగిస్తున్నట్లు తెలిపారు. వారు మరింతగా సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలని పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) వృత్తిదారులు, యువత, ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతామని, త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లా, గ్రామాలలో, సభ్యత్వ నమోదు, కమిటీల ఏర్పాటు చేస్తామని సంతోష్ చారి వెల్లడించారు. ఈ సందర్భంగా వెంకటయ్య చారి మాట్లాడుతూ నాపై ఉంచిన నమ్మకానికి అధ్యక్షులు నౌండ్ల సంతోష్ చారి కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో విశ్వకర్మ బంధువుల సమస్యల పరిష్కారం కోసం నా వంతు కృషి చేస్తానని తెలిపారు.

# ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీగా ఫసల్‌వాదికి జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు

## - న్యూఢిల్లీ లో జాతీయ పురస్కారం స్వీకరించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, గ్రామ సర్పంచ్ హరిప్రసాద్..

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, జూన్ 04 : సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండలంలోని ఫసల్‌వాది గ్రామ పంచాయతీ మహిళా సాధికారత, మహిళలకు అనుకూలమైన సేవలు, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రతిభ కనబరిచి “ఉమెన్ ఫ్రెండ్లీ థీమ్” కేటగిరీలో జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా బుధవారం న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర పంచాయతీరాజ్, మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ (లాలన్ సింగ్), కేంద్ర సహాయ మంత్రి ఎస్.పీ. సింగ్ బఘేల్ చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేశారు. సంగారెడ్డి జిల్లా తరఫున జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఫసల్‌వాది గ్రామ సర్పంచ్ హరి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి గోవింద్ శెట్టి ఈ జాతీయ అవార్డును



స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జానకి రెడ్డి, డిపిఓ మల్లారెడ్డి, డిఎల్‌పిఓ అనిత, ఎంపీఓ శ్రీకాంత్ పాల్గొన్నారు. మహిళల సంక్షేమం, భద్రత, సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, గ్రామాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించే చర్యల ఫలితంగానే ఈ గుర్తింపు లభించింది.



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

# పెబ్బేరులో అండర్-14 క్రికెట్ టోర్నమెంట్ ఘన ప్రారంభం

పెబ్బేరు, జూన్ 04 : వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో మహబూబ్‌నగర్ క్రికెటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14 క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌కు టీ-షర్టులను స్పాన్సర్ చేసిన డాక్టర్ భరత్ కు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమానికి పెబ్బేరు మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీనివాస్ గౌడ్, పట్టణ బీఆర్ఎస్ నాయకుడు సాయినాథ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, బీజేపీ యువ నాయకులు దారాసింగ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అండర్-14 క్రీడాకారులను అభినందించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.టోర్నమెంట్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచిన పెబ్బేరు అండర్-14 జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకొని నిర్ణీత ఓవర్లలో 138 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. జట్టు బ్యాట్స్‌మన్ నీరజ్ అర్ధశతకం సాధిస్తూ 50 పరుగులతో ఆకట్టుకున్నాడు.అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ అండర్-14 జట్టు 13 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాచ్‌లో ఇరు జట్ల క్రీడాకారులు ప్రతిభ కనబర్చగా, ప్రేక్షకులు ఉత్సాహంగా వీక్షించారు. నిర్వాహకులు అతిథులకు, క్రీడాకారులకు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ చిత్రపటాలకు పాలాభిషేకం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జూన్ 04 : జాతీయ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సందర్భంగా జగిత్యాల బిజెపి సీనియర్ నాయకుల అధ్వర్యంలో గురువారం స్థానిక తహసిల్ చౌరస్తా వద్ద ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ల చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు.



తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసినందుకు, జగిత్యాల ప్రాంత అభివృద్ధికి దోహదపడే రహదారి ప్రాజెక్టులకు ఆమోదం తెలిపిన సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ రహదారుల నిర్మాణానికి వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా జగిత్యాల జిల్లా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందడంతో పాటు ప్రయాణ సమయం తగ్గి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఎసిఎస్ రాజు, సిపెల్లి రవీందర్, కౌన్సిలర్ అరవ లక్ష్మి, నరెందుల శ్రీనివాస్, అంకర్ సుధాకర్, చీటీ శేకర్ రావు, లింగాల శ్రీకాంత్ రావు, ఠాకూర్ కిషోర్ సింగ్, ఎడమల వెంకట్ రెడ్డి, ఠాకూర్ విద్య సింగ్, పోరండ్ల భిక్షపతి, గోదిశేల నాగరాజు, ఎండి సుమీర్, కుర్మచలం సతీష్, కస్తూరి రాజు, బలేటి ఎర్ర శ్రీనివాస్, బిట్టు పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలి

## -జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

(ప్రజాలక్ష్యం బ్యూరో)

మంచిర్యాల జూన్ 4 : ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగంగా కొనుగోలు కేంద్రాల నుండి తరలించిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ గోదామును మండల తహసిల్దార్ సంతోష్ కుమార్ తో కలిసి సందర్శించి ధాన్యం, మొక్కజొన్నల దిగుమతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రా లలో నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి కేటాయించిన ప్రకారం తరలించడం జరుగుతుం దని తెలిపారు. ధాన్యంతో పాటు గోదాములకు వచ్చిన మొక్కజొన్న లను దిగుమతి చేసి నిల్వ చేయాలని నిర్వాహకులకు సూచించారు. హమాలీల పులి వేతనం చెల్లింపులపై పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ తో మాట్లాడి సకాలంలో కూలి డబ్బులు చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ వేగవంతం చేయాలి

## - జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

(ప్రజాలక్ష్యం బ్యూరో)

మంచిర్యాల జూన్ 4 : ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి ఎస్.డబ్ల్యూ.సి. నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేయాలని తెలిపారు. ప్రభుత్వ నిర్దేశిత గడువులోగా జిల్లాలో ధాన్యం ప్రక్రియ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఆ దిశగా అధికారులు సమన్వ యంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిఎస్‌సి, ఎసిఎస్ఓ, డిసిఓ, డిపిఎం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ...

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



నిర్మల్, జూన్ 03 : భైంసా పట్టణంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భైంసా అర్బన్, భైంసా రూలర్‌కు సంబంధించిన లబ్ధిదారులకు మొత్తం 185 చెక్కులను ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివాహ ఖర్చుల భారం తగ్గించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాలు సమాజంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉప యోగకరంగా నిలుస్తున్నాయని ఆయన అన్నారు. ప్రజలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# యువత ప్రతిభావంతులను ఆదర్శంగా తీసుకోవాలి

## - భాజపా సీనియర్ నాయకులు రమణారావు
## - ఐఐటీలో ప్రతిభ కనబరిచిన యువకునికి అభినందనలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జూన్ 03 : కుంటాల మండలంలోని ఆయా గ్రామా లకు చెందిన యువకులు ఇటీవలే అగ్ని వీరుకు ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులందరినీ భాజపా సీనియర్ నాయకుడు జీవి రమణారావు ఆధ్వర్యంలో గురువారం శాలువాతో సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఓలా గ్రామానికి చెందిన కంబోలి నవదీప్ ఐఐటీలో సీట్ సాధించగా ఆయనను సైతం అభినందించారు. నేటి తరం యువత ప్రతిభవంతులను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని రమణారావు సూచిం చారు. ఈ కార్యక్రమంలో కుంటాల మండలం సర్పంచుల సంఘం అధ్యక్షుడు లింగురాం పటేల్ జక్కుల గజేందర్ హిమ్మత్ రావు పటేల్ బాజీరావు పటేల్ ఉప సర్పంచ్ భోగ రమణ అశోక్ విశ్రాంత ఉపాధ్యాయులు రమేష్ గౌడ్ సోమ శంకర్ సార్ బిజెపి నాయకులు, తాటి శివ కళ్యాణి గజేందర్ తదితరులు పాల్గొన్నారు

# ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాల ప్రచారం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




ఖానాపూర్, జూన్ 4 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ గ్రామంలో గల పి.ఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్ సహచర ఉపాధ్యాయు లతో కలిసి ప్రైవేటుకు ధీటుగా తమ పాఠశాల ప్రచారంను ప్రారం భించినారు. ఇందులో భాగంగా ఖానాపూర్ పట్టణంలోని వివిధ కూడళ్లలో, మండలంలోని వివిధ గ్రామాలలో విద్యార్థులు సాధించిన మార్కులతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్ మాట్లాడుతూ చాలామంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీ బాసర, వివిధ ప్రతిష్టాత్మక కళాశాలల్లో సీట్లు సాధించినారని, రెండవ విడతలు ఇంకా కొంతమంది సీట్లు సాధిస్తారని తెలిపినారు. ప్రైవేటుకు దీటుగా ప్రచారం ప్రారంభించిన పాఠశాల సిబ్బందిని ప్రజలు అభినందిస్తున్నారు.



# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు తమ పంటలు వేసుకోవాలి

### - పంట మార్పిడి పద్ధతులు అవలంబించాలి - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా
### - గ్రామ మహిళా సంఘ భవనం, జీవనోపాధి ఆర్థిక సాధికారిత కేంద్రాల ప్రారంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జూన్ 4 : వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు తమ పంటల సాగులో మార్పులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. గురువారం కుంటాల మండలం అంబగంటి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది ఆశించినంత స్థాయిలో వర్షపాతం ఉండకపోవచ్చని వాతావరణ శాఖ నివేదికలు సూచిస్తున్నందున రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని అన్నారు. పంట మార్పిడి పద్ధతులను అవలంబించి, తక్కువ నీటి అవసరమయ్యే కొత్త రకాల పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవసరమైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందిస్తారని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించి అధిక లాభాలు పొందాలని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని వినియోగించుకొని డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లైసెన్స్ పొందిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అవసరానికి మించి ఎరువులు వాడరాదని సూచించిన కలెక్టర్, జిల్లాలో రికార్డు స్థాయిలో మొక్కజొన్న కొనుగోలు జరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలులో నిర్మల్ జిల్లా మూడో స్థానంలో నిలిచిందని తెలిపారు. రాబోయే వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కూడా పాటించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చెత్త బండ్లలో వేయడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, ప్లాస్టిక్ వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టుకోవాలని, సోక్‌పిట్లు నిర్మించడం ద్వారా భవిష్యత్తు తరాలకు నీటి కొరత రాకుండా చూడాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు కందులు, మినుములు, పెసర్లు, నువ్వులు, పొద్దుతిరుగుడు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు మంచి లాభాలు పొందుతున్నారని, ఇతర రైతులు కూడా ఆ దిశగా ముందుకు రావాలని అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇద్దరు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. గ్రామ మహిళా సంఘ భవనం, జీవనోపాధి ఆర్థిక సాధికారిత కేంద్రాల ప్రారంభం అంతకుముందు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ మహిళా సంఘ భవనం, జీవనోపాధి ఆర్థిక సాధికారిత కేంద్రాలను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గ్రామసభకు హాజరైన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డీపీఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీఓ వనజ, సర్పంచ్ జ్యోతిబాయి, ఇతర అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



# స్వయం సహాయక మహిళా బృందాలకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు ప్రారంభం

### - హాజీపూర్ పీహెచ్‌సీలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం
### -రోజుకు 50 మంది మహిళలకు 33 రకాల వైద్య పరీక్షలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హాజీపూర్, జూన్ 4 : ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వయం సహాయక మహిళా బృందాలు, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సభ్యుల కోసం ప్రత్యేక ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని ప్రోగ్రామ్ ఆఫీసర్, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు 33 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోజుకు 50 మంది మహిళలకు వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేయడంతో పాటు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.వీవో గ్రూపుల ద్వారా నమోదు చేసుకున్న మహిళలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకువచ్చి పరీక్షలు చేయించాలని సూచించారు. ఈ పరీక్షల ద్వారా రక్తపోటు, మధుమేహం వంటి అసంక్రమణ వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందించవచ్చని తెలిపారు. అలాగే మహిళలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు,ఇతర వ్యాధులను గుర్తించడంలో ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలి రోజు 50 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య వివరాలను అందజేయడంతో పాటు అవసరమైన చికిత్సలు, ఆరోగ్య సూచనలు అందించారు. వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అసంక్రమణ వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకు పాటించాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.అదేవిధంగా 14 సంవత్సరాలు నిండిన బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ వ్యాక్సిన్ ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించవచ్చని తెలియజేస్తూ తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ కుమార్తెలకు వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ ప్రసన్న, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, అల్లాడి శ్రీనివాస్, సీహెచ్‌వోలు నావేద్, పుట్ట సత్తయ్య, రఘుపతి, పద్మ, డీఆర్‌డీఏ పీడీ స్వర్ణలత, ఏపీఎం వెంకటేష్, మలేరియా విభాగం సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు, సర్పంచ్ అధికారులు, ఆశా ఆరోగ్య కార్యకర్తలు, మండల సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలి

### నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ నితికా పంత్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూన్ 4 : కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయం లో గురువారం జిల్లా ఎస్పీ నితికా పంత్ , జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేయరాదని, పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది నిరంతరం గస్తీ కాస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్ 100 కాల్స్‌కి త్వరతగతిన స్పందించాలని అన్నారు. అనంతరం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్లో ఉన్న పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకొని, వారి పురోగతి కి కృషి చేయాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు, మట్కా, జూదం, బెట్టింగ్ లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహన కల్పించి తమ తమ నివాస ప్రాంతాల్లో వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చేయాలని తెలిపారు. ప్రాపర్టీ కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నాకాబంది, కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ,ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారి గురించి నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్ , ఆసిఫాబాద్ డిఎస్పీ అశోక్, జిల్లాలోని ఇన్స్‌పెక్టర్స్, సబ్ ఇన్స్‌పెక్టర్స్ పాల్గొన్నారు.

# హెల్పింగ్ హ్యాండ్స్ ఎన్జీవో ముసుగులో 'గన్'మ్యాన్ దొంగతనాలు

### -కరుడుగట్టిన అంతరాష్ట్ర కేటుగాడు వికాస్ సింగ్ అరెస్ట్!
### - వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వికారాబాద్, జూన్ 4 : తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తూ వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర ప్రమాదకర దొంగ వికాస్ సింగ్‌ను వికారాబాద్ పోలీసులు అత్యంత చాకచక్యంగా అరెస్ట్ చేశారు. నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా కేసు వివరాలను వెల్లడించారు. నిందితుడి నుంచి భారీగా బంగారంతో పాటు ఒక తుపాకీని (గన్) కూడా పోలీసులు స్వాధీనం చేసుకోవడం జిల్లాలో కలకలం రేపింది.

**సీసీ కెమెరా నిఘాలో దొరికిన దొంగ!**

గత నెల 5వ తేదీన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మణికంఠ నగర్‌లో తాళం వేసి ఉన్న ఒక ఇంట్లోకి చొరబడిన దుండగుడు ఒకటిన్నర తులాల బంగారం, 2,10,000 నగదు దోచుకెళ్లాడు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ప్రారంభించారు. పట్టణంలోని సీసీ కెమెరాల పుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించగా, కరడుగట్టిన నేరస్థుడు వికాస్ సింగ్ కదలికలు నిఘా నేత్రానికి దొరికాయి. దీని ఆధారంగా వ్యూహాత్మకంగా వ్యవహరించిన పోలీసులు వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు.

**16 ఏళ్లకే నేరాల బాట.. జైలుకెళ్లినా మారని నైజం**

పోలీసుల విచారణలో వికాస్ సింగ్ నేర చరిత్రను విని అధికారులు సైతం విస్మయానికి గురయ్యారు.బాల నేరస్థుడిగా ఎంట్రీ: కేవలం 16 సంవత్సరాల వయస్సు నుంచే వికాస్ సింగ్ నేర జీవితాన్ని ప్రారంభించాడు.పాత నేరాలు: గతంలో సంగారెడ్డి, బొల్లారం ప్రాంతాల్లో ఇతనిపై ఏకంగా 34 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో జైలు శిక్ష కూడా అనుభవించాడు. జైలు నుంచి విడుదలైనప్పటికీ వికాస్ తన బుద్ధి మార్చుకోలేదు. వికారాబాద్ జిల్లా, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీస్ కమీషనరేట్ పరిధుల్లో మరో 27 రాత్రి పూట దొంగతనాలకు పాల్పడినట్లు ఎస్పీ వివరించారు.

**దొంగ సొమ్ముతో ఎన్జీవో రన్!**

వికాస్ సింగ్ దొంగతనం చేసిన సొమ్ముతో కేవలం జల్సాలు చేయడమే కాకుండా, సమాజంలో మంచి పేరు సంపాదించడం కోసం 'హెల్పింగ్ హ్యాండ్స్' పేరుతో ఒక స్వచ్ఛంద సంస్థను కూడా ప్రారంభించడం గమనార్హం. పగలు ఎన్జీవో నిర్వాహకుడిగా చెలామణి అవుతూ.. రాత్రి వేళల్లో తాళాలు వేసిన ఇళ్లను గుల్ల చేయడం ఇతని స్టైల్.

**వెనుక ఉండి నడిపించిన యూపీ వ్యాపారులు.. 'గన్' సప్లై!**

వికాస్ సింగ్ వెనుక ఉత్తరప్రదేశ్‌కు చెందిన నలుగురు బంగారు నగలు వ్యాపారులు ఉన్నట్లు విచారణలో తేలింది. శ్యామ్ మోసెస్, సూరజ్ మోహన్, అశోక్ సోనీ, వికాస్ అగ్రహారి. ఈ వ్యాపారులే వికాస్ సింగ్‌ను దొంగతనాలకు ఉసిగొల్పడమే కాకుండా, రక్షణ కోసం మరియు బెదిరింపులకు పాల్పడటానికి ఒక తుపాకీని కూడా సమకూర్చారు. వికాస్ సింగ్ వద్ద నుంచి దొంగిలించిన బంగారంతో పాటు ఈ తుపాకీని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దొంగతనాలకు ప్రోత్సహించి, ఆయుధాలు సరఫరా చేసిన సదరు యూపీ వ్యాపారులపై కూడా చట్టపరమైన కేసులు నమోదు చేసి, దర్యాప్తు వేగవంతం చేసినట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా స్పష్టం చేశారు. చాకచక్యంగా దొంగను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




కాగజ్‌నగర్, జూన్ 4 : కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్ నగర్ పురపాలికను పరిశుభ్రంగా ఉంచేలా మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌక్ తీరం రాజ్ టాకీస్ చౌరస్తా వరకు గల రహదారిని మున్సిపల్ అధికా రులు, స్థానిక వార్డు కౌన్సిలర్లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని తెలిపారు. మున్సిపల్ అధికారులు ప్రతిరోజు మురుగు కాలువలు శుభ్రపరచాలని, ప్రతి రోజు తడి, పొడి చెత్తను సేకరించాలని తెలిపారు. పట్టణంలోని గురుకృప టిఫిన్ సెంటర్ నిర్వాహకులు నీటిని, వినియోగించిన ప్లేట్లను రోడ్డుపై పడవేసినందుకు టిఫిన్ సెంటర్ యజమానికి జరిమానా విధించాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతిని ఆదేశించారు. దుకాణాల యజమానులు ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ బాటిల్లను రోడ్డుపై పడవేయకుండా చెత్త కుండీలో వేయాలని, పట్టణాన్ని శుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా ఇసుక మట్టి తరలింపు చేస్తే కఠిన చర్యలు

### జిల్లా కలెక్టర్ కె హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాగజ్‌నగర్, జూన్ 4 : సరియైన అనుమతులు లేకుండా ఇసుక మట్టి తరలింపు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు గురువారం కాగజ్నగర్ మండలం గన్నారం మాండవ, ఆరెగూడ మరియు అనుకొడ గ్రామాలలో గల చెరువులను సందర్శించి పరిశీలించారు.నజ్రుల్ నగర్ విలేజ్ నెం.12 గ్రామ పరిధిలో మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను తనిఖీ చేశారు. తనిఖీలో సంబంధిత వ్యక్తుల వద్ద ఎలాంటి అనుమతులు లేదా సంబంధిత పత్రాలు లేవని గుర్తించడంతో ఆ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎవరైనా అక్రమంగా మట్టి లేదా ఇసుకను తరలించినట్లయితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. మట్టి లేదా ఇసుక రవాణా చేపట్టే ముందు సంబంధిత శాఖల నుండి అవసరమైన అనుమతులు పొందిన తరువాత మాత్రమే తరలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ మండల తహసీల్దార్ మధుకర్, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.




# టీజీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో కాన్కూర్‌లో పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ

(ప్రజాలక్ష్యం బ్యూరో)

మంచిర్యాల జూన్ 4 : మంచిర్యాల జిల్లా, జైపూర్ మండలంలోని కాన్కూర్ గ్రామస్తులు పర్యావరణ పరిరక్షణకు పాటుపడతామని గురువారం ప్రతిజ్ఞ చేసి పలు గ్రామాలకు ఆదర్శంగా నిలిచారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో కాన్కూర్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఉన్న నీలగిరి ప్లాంటేషన్ లో గ్రామస్తులకు పర్యావరణ పరిరక్షణ– వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు అడవుల ప్రాముఖ్యత గురించి వివరించారు. అడవులలో సంచరించే వన్య ప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టవద్దని, అడవి జంతువులను వేటాడడం చట్టరీత్యా నేరమని వివరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాన్కూర్ గ్రామంలో ప్లాస్టిక్, ఈ–వేస్టేజ్, తడి చెత్త, పొడి చెత్త కాలుష్య నివారణకు గాను గ్రామస్తులు సహకరించాలని గ్రామ సర్పంచ్, కార్యదర్శి కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ గణేష్, ప్లాంటేషన్ మేనేజర్లు గోగు సురేష్ కుమార్ (మంచిర్యాల రేంజ్), జలపతి (బెల్లంపల్లి రేంజ్), లక్ష్మణ్ (కాగజ్‌నగర్ రేంజ్), కాన్కూర్ గ్రామ సర్పంచ్ సాగరిక,గ్రామ కార్యదర్శి శ్రావణ్,కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకటేశం గౌడ్,ఫీల్డ్ అసిస్టెంట్ రేగుంట చందు, టీజీ ఎఫ్ డీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం బేస్‌మెంట్ ధ్వంసంపై చర్యలు తీసుకోవాలి

### - మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, జూన్ 4 : భారత మాజీ ఉప ప్రధాని, దళితుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహానేత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద బేస్‌మెంట్ ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విగ్రహం వద్ద దెబ్బతిన్న బేస్‌మెంట్‌కు తక్షణమే మరమ్మతులు చేపట్టి, పరిసరాలను పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచాలని కోరారు. ఈ సందర్భంగా భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ మాట్లాడుతూ, సామాజిక న్యాయం కోసం కృషి చేసిన బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద జరిగిన ఈ ఘటన బాధాకరమని అన్నారు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడి వెంటనే చర్యలు తీసుకుని బేస్‌మెంట్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఈ విషయమై భువనగిరి మున్సిపల్ చైర్మన్, ఆర్డీవో, తహసీల్దార్ (ఎంఆర్‌ఓ), మున్సిపల్ కమిషనర్‌లకు వినతి అందజేసి, విగ్రహం వద్ద పరిస్థితిని పరిశీలించారు. కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బట్టు రామచంద్రయ్య, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ మాదిగ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కకునూరి మహేందర్, బాణోత్ భాస్కర్ నాయక్, కుతడి సురేష్, జాలిగం శివ, బండారు శివశంకర్, చుక్క స్వామి, సందేలా సుధాకర్, ఆనంపట్ల బలస్వామి, బట్టు ప్రేమ్‌కుమార్, కాశపాక మహేష్, బొల్లాపెల్లి అశోక్, బట్టు సందీప్, బర్రె క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో 161 ఎజెండా అంశాలపై చర్చ

### - హాజరైన ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, జూన్ 04: మహబూబాబాద్ పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ అధ్యక్షతన గురువారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు హాజరయ్యారు.సమావేశంలో పట్టణ అభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 161 ఎజెండా అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధులు, అధికారులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ వార్డుల వారీగా ప్రజా సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

# ప్రజా పాలనకు ప్రజల ప్రశంసలు.. సూర్యాపేటకు ప్రత్యేక గుర్తింపు

## 99 రోజుల ప్రగతి ప్రణాళికలో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పరిపాలనకు ప్రశంసల వెల్లువ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సూర్యాపేట, జూన్ 04 : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం సూర్యాపేట జిల్లాలో విజయవంతంగా ముగింపు దశకు చేరుకుంది. గ్రామీణాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం, ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాల్లో జిల్లాను ముందంజలో నిలిపిన ఈ కార్యక్రమం ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ నాయకత్వంలో అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయడం ఈ కార్యక్రమ విజయానికి ప్రధాన కారణంగా నిలిచింది. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకోవడం, మారుమూల గ్రామాలు, తండాలను సందర్శించడం, క్షేత్రస్థాయిలో సమీక్షలు నిర్వహించడం ద్వారా లక్ష్యాలను సాధించడంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ కనబరిచింది.



**10 కీలక అంశాలతో ప్రగతి ప్రణాళిక**

99 రోజుల కార్యాచరణలో భాగంగా పరిశుభ్రత, ఫైళ్ల పరిష్కారం, ఆరోగ్యం, రోడ్డు భద్రత, సంక్షేమం, పిల్లల రక్షణ, వ్యవసాయం, విద్య, యువత-క్రీడలు, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి పలు అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

**పరిశుభ్రత నుంచి పర్యావరణం వరకు**

గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో విస్తృత పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడంతో పాటు పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, వైద్య శిబిరాలు, రైతు సమస్యల పరిష్కారం, విద్యా సంస్థల అభివృద్ధి, యువజన కార్యక్రమాలు, మహిళా సంఘాల బలోపేతం, మొక్కల నాటకం వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశారు.

**సంఖ్యల్లో సూర్యాపేట ప్రగతి**

మార్చి 6 నుంచి 15 వరకు నిర్వహించిన పరిశుభ్రత, ఫైళ్ల క్లియరెన్స్ కార్యక్రమాల్లో జిల్లావ్యాప్తంగా 1,28,101 మంది పాల్గొన్నారు. 1,30,716 కిలోల ఘన వ్యర్థాలను తొలగించారు. 1,910 కార్యాలయ భవనాలను శుభ్రపరిచారు. 4,443 పెండింగ్ ఫైళ్లను పరిష్కరించారు.

**క్షేత్రస్థాయిలో కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ**

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను కేవలం అధికారిక కార్యక్రమంగా కాకుండా ప్రజల భాగస్వామ్యంతో కూడిన ఉద్యమంలా నిర్వహించడంలో జిల్లా యంత్రాంగం విజయవంతమైంది. గ్రామ సభలు, మండల స్థాయి సమావేశాలు, నియోజకవర్గ స్థాయి కార్యక్రమాలు, జిల్లా స్థాయి సమీక్షల ద్వారా ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా చర్యలు చేపట్టారు.

**ఇతర జిల్లాలకు ఆదర్శంగా సూర్యాపేట**

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక అమలులో సూర్యాపేట జిల్లా చూపిన చొరవ, సాధించిన ఫలితాలు రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు చేరువైన పరిపాలన, సమర్థవంతమైన అమలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణతో సూర్యాపేట జిల్లా ప్రత్యేక గుర్తింపు సాధించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# సీఎం రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన డీసీసీ చీఫ్ శివసేన రెడ్డి

- శాలువాతో సన్మానం... పూల బొకే అందజేత
- సాగునీటి ప్రాజెక్టుల ఫోటో గ్యాలరీని పరిశీలించిన సీఎం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, జూన్ 4 : ఉమ్మడి పాలమూరు జిల్లా రైతాంగానికి సాగునీరు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపడుతున్న ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిశీలన కోసం జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి డీసీసీ అధ్యక్షుడు, శాట్స్ చైర్మన్ శివసేన రెడ్డి ఘన స్వాగతం పలికారు. గురువారం మక్తల్ పర్యటనకు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శివసేన రెడ్డి పూల బొకే అందజేసి, శాలువాతో సత్కరించి ఆత్మీయ అభినందనలు తెలిపారు. పాలమూరు ప్రాంత అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం ముఖ్యమంత్రి తీసుకుంటున్న ప్రత్యేక చొరవను ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఇరిగేషన్ శాఖ ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని, ప్రాజెక్టుల ప్లానింగ్ మ్యాప్స్‌ను పరిశీలించారు. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం, కృష్ణా--భీమా నదులపై ప్రతిపాదిత బ్యారేజీల నిర్మాణ పురోగతిపై అధికారులు సమగ్ర వివరాలు అందించారు. ప్రాజెక్టుల నిర్మాణ దశలు, సాగునీరు అందనున్న ప్రాంతాలు, భవిష్యత్ కార్యాచరణపై అధికారులను అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి, పనులను వేగవంతం చేసి రైతులకు త్వరితగతిన ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ పాలమూరు ప్రాంతం దశాబ్దాల సాగునీటి కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి పర్యటనతో జిల్లాలోని కీలక ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులకు మరింత ఊపు వస్తుందని, రైతాంగానికి త్వరలోనే శుభవార్తలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# లక్ష్యం.. లక్ష్మారం ప్రగతి!

- పారదర్శకంగా పాలన... ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి...
- మౌలిక వసతుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- ఇస్నాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మోటె సుమలత శ్రీకాంత్ స్పష్టం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పటాన్‌చెరు, జూన్ 4 : మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పాలకమండలి ముందుకు సాగుతోందని ఇస్నాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి మోటె సుమలత శ్రీకాంత్ అన్నారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మారం వార్డు కార్యాలయంలో గురువారం నిర్వహించిన '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' సభకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. వార్డుల్లో నెలకొన్న స్థానిక సమస్యల పరిష్కారం, ప్రజలకు అందుతున్న మౌలిక వసతులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఈ సమావేశంలో చర్చించారు.

**సమస్యల త్వరితగతిన పరిష్కారమే ధ్యేయం**

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మోటె సుమలత శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రజా పాలనలో భాగంగా ప్రజల నుంచి వచ్చే వినతులు, సమస్యలను గుర్తించి వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించడమే ఈ 99 రోజుల ప్రగతి ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. లక్ష్మారం వార్డు పరిధిలో ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలని ఆమె అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజల సహకారంతోనే ఇస్నాపూర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దగలమని, ప్రతి వార్డులోనూ పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

**కౌన్సిలర్ల అభిప్రాయాల స్వీకరణ**

ఈ సభలో లక్ష్మారం వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు చురుగ్గా పాల్గొని తమ తమ పరిధిలోని సమస్యలను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. వార్డుల్లో ఇంకా చేపట్టాల్సిన డ్రైనేజీ పనులు, సిసి రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుదలపై పలు సూచనలు చేశారు. ప్రజాప్రతినిధులు వ్యక్తపరిచిన అభిప్రాయాలను, సమస్యలను నోట్ చేసుకున్న చైర్‌పర్సన్, వాటిని ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**ప్రజా భాగస్వామ్యంతోనే ప్రగతి**

మున్సిపాలిటీ పరిధిలో సమగ్ర అభివృద్ధి సాధించాలనే సంకల్పంతోనే ఈ ప్రగతి ప్రణాళిక సభలను ఏర్పాటు చేస్తున్నట్లు పాలకమండలి సభ్యులు తెలిపారు. వార్డు కార్యాలయం ద్వారా సేవలను ప్రజలకు మరింత దగ్గర చేస్తామని, ప్రజలు కూడా మున్సిపల్ అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది లక్ష్మారం వార్డుకు చెందిన కాలనీ వాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాకు 4 వేల గంజాయి టెస్టింగ్ కిట్లు

- మహబూబాబాద్‌ను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం - ఎస్పీ డాక్టర్ శబరీష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, జూన్ 04: జిల్లాలో గంజాయి వినియోగం, రవాణా, విక్రయాలను పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ గురువారం తన కార్యలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. గంజాయి గుర్తింపునకు 4 వేల అత్యాధునిక టెస్టింగ్ కిట్లు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు.డీఎస్పీల పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు బృందాలు రాత్రివేళ గస్తీ నిర్వహిస్తూ అనుమానాస్పద ప్రాంతాలు, యువత ఎక్కువగా గుమికూడే ప్రదేశాలపై నిఘా ఉంచుతున్నాయని తెలిపారు. టెస్టింగ్ కిట్ల ద్వారా కేవలం 10 నిమిషాల్లోనే గంజాయి వినియోగాన్ని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు.మత్తు పదార్థాలకు బానిసైన వారిని సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి డీ-అడిక్షన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అవసరమైన వారికి కౌన్సెలింగ్, వైద్య సహాయం అందిస్తామని చెప్పారు. గంజాయి విక్రయం, వినియోగం, రవాణా వంటి కార్యకలాపాల్లో పాల్గొనేవారిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి సంబంధిత సమాచారం తెలిసిన వెంటనే 8712656999 నంబర్‌కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు. ప్రజలు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, ప్రజాప్రతినిధులు పోలీసులకు సహకరించి మహబూబాబాద్‌ను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు.

# బదిలీపై వెళ్తున్న అధికారులకు ఆత్మీయ వీడ్కోలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, జూన్ 4 : సింగరేణి ఆర్జీ-2 ఏరియాలో సమర్థవంతంగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న డీజీఎం (ఈ అండ్ ఎం) గోవర్ధన వెంకట రాజాజీ, ఏజీఎం (పర్సనల్) పుప్పాల అరవింద రావును ఏరియా అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. రాజాజీ ఆర్జీ-1 ఏరియాలో ఏరియా ఇంజనీర్‌గా, అరవింద రావు హైదరాబాద్‌లోని లా విభాగానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం బండి వెంకటయ్య మాట్లాడుతూ ఒసీపీ-3 ప్రాజెక్టు అభివృద్ధి, ఏరియా పురోగతికి వారు అందించిన సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. వారి అంకితభావం, సాంకేతిక నైపుణ్యం, విధి నిర్వహణలో చూపిన నిబద్ధత సంస్థ అభివృద్ధికి దోహదపడిందని కొనియాడారు. కొత్త బాధ్యతల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సన్మాన గ్రహీతలు రాజాజీ, అరవింద్ రావు మాట్లాడుతూ ఆర్జీ-2 ఏరియాలో పనిచేసిన కాలం తమ వృత్తి జీవితంలో మరపురాని అనుభవంగా నిలిచిందన్నారు. సహోద్యోగులు, అధికారులు అందించిన సహకారం, ప్రోత్సాహం, ఆత్మీయత ఎప్పటికీ గుర్తుండిపోతాయని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎస్వో టు జీఎం మాలోతు రాముడు, ఏజీఎం (ఈ అండ్ ఎం) సుజన్ మెహ్రా, ఏజీఎం (ఐఈడీ) చంద్రశేఖర్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సంతోష్ కుమార్, డీజీఎం (పర్చేస్) వెంకట రామచంద్ర, డీజీఎం (సర్వే) ఉజ్వల్ బందోపాధ్యాయ, ఏజెంట్ నెహ్రూ, అకౌంట్స్ మేనేజర్ తిరుపతి రెడ్డి, క్వాలిటీ మేనేజర్ సుభాష్ ఎస్ఈ (సివిల్) బాలరాజు, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ వేణుగోపాల్, ఎన్విరాన్‌మెంట్ మేనేజర్ వేణు కుమార్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ షరీఫ్ మహమ్మద్, సీనియర్ ఎస్టేట్ ఆఫీసర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

# జనగణనను పకడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, జూన్ 04 : జనగణన కార్యక్రమాన్ని అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించా[రు] సమావేశ మందిరంలో జనగణన అధికారులతో సమావేశం నిర్వహి[ంచిన] జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జనగణన దేశ అభివృద్ధి[,] సంక్షేమ పథకాల అమలుకు అత్యంత కీలకమైన ప్రక్రియ అ[ని] సందర్శించి,ప్రజల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని[,] పొరపాట్లు లేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జనగణన నిర్వహించా లన్నారు. జనగణన సిబ్బందికి అవసరమైన శిక్షణ,సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా జనగణన సిబ్బందికి సహకరించి సరైన సమాచారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. జనగణన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు,జనగణన సిబ్బంది పాల్గొన్నారు.





# కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలి

## భాజపా ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


ములుగు, జూన్ 4 : ప్రధానమంత్రి మోడీ ఆధ్వర్యంలో కేంద్రం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని భారతీయ జనతా పార్టీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు.గురువారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జిల్లా ప్రశిక్షణ అభియాన్--2026 రెండు రోజుల శిక్షణ శిబిరం ఘనంగా ప్రారంభమైంది.జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరైనారు.అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ అభియాన్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన అంత్యోదయ సిద్ధాంతం,సమగ్ర మానవతావాదం భావజాలాన్ని కార్యకర్తలు గ్రామస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. భాజపా సిద్ధాంతాలు,కేంద్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలు, సంస్థాగత నిర్మాణం,నాయకత్వ లక్షణాలు,సామాజిక సేవా కార్యక్రమాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించడమే ఈ శిక్షణ శిబిరం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.రెండు రోజుల పాటు కొనసాగే ఈ శిక్షణ అభియాన్‌లో పార్టీ చరిత్ర, సిద్ధాంతాలు, సంస్థాగత నిర్మాణం,సోషల్ మీడియా వినియోగం,ప్రజా సమస్యలపై పోరాటాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం వంటి పలు అంశాలపై ప్రత్యేక తరగతులు ఉంటాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్,మాజీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీరా కృష్ణవేణి నాయక్,భూక్యా జవహర్ లాల్, మున్సిపాలిటీ కౌన్సిలర్ కొత్త సురేందర్,జిల్లా ప్రధాన కార్యదర్శిలు జాడి వెంకట్,శ్రీలమంతుల రవింద్రాచారి,నగరపు రమేష్ జిల్లా ఇంచార్జ్ డాక్టర్ కొరదాల నరేష్ ,జిల్లా ప్రశిక్షణ ప్రభారి జలగం రంజిత్,జిల్లా పదాధి కారులు,మండల అధ్యక్షులు, మోర్చా అధ్యక్షులు,సీనియర్ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 9న జాబ్ మేళా

## - జిల్లా ఉపాధి కల్పనాధికారి రాజశేఖర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పెద్దపల్లి, జూన్ 4 : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో జూన్ 9న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్ తెలిపారు. స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ సంస్థలో లోన్ ఆఫీసర్, కస్టమర్ రిలేషన్ అసోసియేట్ పోస్టుల్లో మొత్తం 30 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఉద్యోగాలు పెద్దపల్లి, కరీంనగర్, మంచిర్యాల్, హుజురాబాద్, జనగాం, నల్గొండ, మిర్యాల గూడ, సూర్యాపేట, నర్సంపేట, పరకాల, మహబూబాబాద్, నిజామాబాద్, ఆదిలాబాద్, బోధన్, ఇచ్చోడ, ఆర్మూర్, నిర్మల్ తదితర ప్రాంతాల్లో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఇంటర్ లేదా అంతకంటే పై విద్యార్హత కలిగిన ఫ్రెషర్స్‌తో పాటు అనుభవం ఉన్న అభ్యర్థులు కూడా అర్హులని, వయస్సు 19 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 9న ఉదయం 11 గంటలకు పెద్దపల్లిలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ మొదటి అంతస్తు, గది నం.233లో రెజ్యూమ్, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో హాజరై నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8985336947, 8121262441 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# పుట్టిన గడ్డ మోర్మూర్ లో గోపు అంత్యక్రియలు

- భారీగా పల్లి వచ్చిన అన్ని పార్టీల నాయకులు
- కన్నీటి నివాళులర్పించిన మోర్మూర్ జనం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామగుండం, జూన్ 4 : రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అందరికీ సుపరిచితుడు రాజకీయ నేత బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోపు ఐలయ్య యాదవ్ అంతిమయాత్ర గౌతమి నగర్ నుంచి గురువారం రాత్రిఅంతర్గాం మండలం మొర్మూర్ గ్రామ మార్కెట్ వద్దకు చేరుకోగానే అన్ని పార్టీల నేతలు గ్రామ ప్రజలు ఐలయ్య అభిమానులు రావడంతో అంతిమయాత్ర జన సముద్రంగా మారింది. డప్పు చప్పుళ్ళు నృత్యాలు ఐలయ్య యాదవ్ రథయాత్ర ముందు.. బలగం. సినిమా పాట.. బలరామ నరసయ్య.. అంటూ సాగిన.. అంతిమయాత్ర.. ఐలయ్య యాదవ్.. జననేత అని స్పష్టం చేసింది.. అంతమ యాత్రలో పెద్దపెల్లి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరు కంటి చందర్, పార్టీ నాయకులు కౌశిక్ హరి ముందు నడవగా... అంతిమ జన యాత్ర.. ఊరి చివరి వరకు.. సాగిన అనంతరం వారి వంశీయులను దహనం చేసిన స్థలంలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలను నిర్వహించారు. ఈ అంతిమ యాత్రలో బిఆర్ఎస్ నాయకులు నడిపల్లి మురళీధర్ రావు టిఆర్ఎస్ నాయకులు అర్సనపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగానికి సకాలంలో విత్తనాలు, ఎరువులను అందించాలి

- నకిలీ విత్తనాలను, పురుగుమందులను అమ్మే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి
- అఖిల భారత ఐక్య రైతు సంఘం ఏఐయూకేయస్ డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పాల్వంచ, జూన్ 4 : భద్రాద్రి జిల్లా పాల్వంచలో అఖిల భారత ఐక్య రైతు సంఘం పాల్వంచ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం పాల్వంచ తహశీల్దార్‌కి వినతి పత్రం అందచేసారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు కల్లూ రి కిషోర్ మాట్లాడుతూ రోజురోజుకు వ్యవసాయానికి సంబంధించిన ఉత్పాదకాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ముఖ్యంగా యూరియా, డిఏపి, కాంప్లెక్స్ ధరలను విపరీతం గా పెంచి అమ్మడం వల్ల రైతులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కుంటున్నారని విమర్శించారు. మార్కెట్లో యూరియా అందుబాటులో లేకపోవడం వల్ల రైతుల ఇబ్బందులు పడుతున్నా పట్టించుకున్న నాధుడు కరువయ్యారన్నారు.కేంద్ర ప్రభుత్వం 2026 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధరలు అపరాలకు నామమాత్రంగా ప్రకటించడం వల్ల రైతులం సరైన గిట్టుబాటు ధర లభించక నష్ట పోతున్నారని వాపోయారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతుకూలీ సంఘం నాయకులు రాయబారావు వెంకటేశ్వర్లు, టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల రమేష్, వేల్పుల రమేష్, కుంజా భాస్కర్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం...

## మున్సిపల్ చైర్మన్ చింత నిప్పుల చంద్రకళ బిక్షపతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ములుగు,జూన్ 4 :ములుగు మున్సిపాలిటీ పరిధిలో పర్యావరణ పరిరక్షణకు పాటు పడదామని మున్సిపల్ చైర్మన్ చింత నిప్పుల చంద్రకళ బిక్షపతి అన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక-99 రోజుల కార్యాచరణలో భాగంగా ములుగు మునిసిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డ్ జీవంతరావు పల్లి లో జరిగిన వార్డు సభకు ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ చింత నిప్పుల చంద్రకళ హాజరై మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, హరితహారం వన మహోత్సవం కార్యక్రమాలను విజయవంతం చేయాలని, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అన్ని వార్డులలో మొక్కలు నాటడం, సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించాలని, పారిశుధ్యం, ప్రజారోగ్యం వార్డు పరిధిలో పరిశుభ్రత చర్యలు తీసుకోవాలని, ము రుగు కాలువల శుభ్రత,ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ,దోమల నివారణ చర్యలు,వర్షాకాల ముందస్తు సన్నద్ధత నీరు నిలిచే ప్రాంతాల గుర్తింపు మరియు డ్రైనేజీ వ్యవస్థల నిర్వహణ,వరద ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని,ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమం ఓటరు నమోదు, సవరణలు,తొలగింపులపై అవగాహన కల్పించాలని, మహిళా భద్రత మహిళల రక్షణకు అందుబాటులో ఉన్న సేవలు, అత్యవసర సహాయ చర్ల పైన అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.

# ఆరోగ్యం





## గుండెపోటుతో యువత మరణం

### -అది హెచ్‌ఓసిఎం కావొచ్చు

మన దేశంలో ప్రతియేటా సుమారు 7 లక్షల మంది ఉన్నట్టుండి కుప్పకూలి మరణిస్తున్నారు. ఈ తరహా మరణాలకు ప్రధాన కారణం సడన్ కార్డియాక్ అరెస్ట్.ఇటీవలే మధ్యప్రదేశ్ రాష్ట్రంలో 23 సంవత్సరాల వయసున్న ఒక యువతి తన సమీప బంధువు పెళ్లి వేడుకల్లో హల్దీ కార్యక్రమం సందర్భంగా డాన్సు చేస్తూ కుప్పకూలిపోయింది.అక్కడే ఆమె బంధువుల్లో ఉన్న వైద్యులు ఆమెకు సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీససిటేషన్) చేసినా ప్రయోజనం లేకపోయింది.వెంటనే ఆస్పత్రికి తరలించగా,అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.ఆమె కుటుంబంలో గతంలో ఆమె సోదరుడు 12 ఏళ్ల వయసులో ఉండగా ఇలాగే ఉన్నట్టుండి గుండెపోటుతో మరణించాడు.ఇలాంటి మరణాలు,వాటికి కారణాలు నివారణ మార్గాల గురించి నగరంలోని ప్రధాన ఆస్పత్రులలో ఒకటైన ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి గుండెవైద్య విభాగాధిపతి,సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ. సాయి రవిశంకర్ పలు విషయాలు తెలిపారు.

సడన్ కార్డియాక్ అరెస్టు అనేది చాలా దురదృష్టకరం. అది వచ్చిన తర్వాత మనకు ఏమైనా చేయడానికి కూడా సమయం ఉండదు. మధ్యప్రదేశ్ ఘటన విషయంలో అక్కడే అదే వేడుకలో కొంతమంది డాక్టర్లు ఉండి,వారు సీపీఆర్ చేసినా ఆ యువతి బతకలేదన్న విషయాన్ని మనం గుర్తించాలి.ఆమె కుటుంబంలో అప్పటికే వాళ్ల సోదరుడు 12 ఏళ్ల వయసులోనే గుండెపోటు కారణంగా మరణించారని చెబుతున్నారు.ఇలా సొంత కుటుంబంలో (అంటే తల్లిదండ్రులు, సోదరులు, సోదరీమణులు) ఎవరికైనా గుండెపోటు వచ్చి మరణించిన చరిత్ర ఉంటే..వారు తప్పనిసరిగా పూర్తిస్థాయి గుండెవైద్య పరీక్షలు చేయించుకోవాలి" అని పేర్కొన్నారు. వైద్యపరీక్షలు చేయిస్తే వారికి పుట్టుకతోనే ఏమైనా గుండె సమస్యలు ఉన్నాయేమో గమనిస్తాం.లేదా..ఇలాంటివారిలో చాలామందికి ఇప్పుడు ప్రధానంగా కనిపిస్తున్న సమస్య హైపర్‌ట్రోఫిక్ అబ్‌స్ట్రక్టివ్ కార్డియోమయోపతి (హెచ్‌ఓసీఎం).ఈ సమస్య ఉన్నవారు బాగా కఠినమైన వ్యాయామాలు చేయకూడదు,డాన్సులు,ఫుట్‌బాల్ లాంటి ఆటలు పనికిరావు.శారీరక శ్రమ ఎక్కువగా ఉండే పనులేవీ చేయకూడదు.దాంతోపాటు ముందునుంచే తగిన వైద్య పరీక్షలు చేయించుకుంటే..అందుకు తగిన చికిత్స కూడా చేసి,వారు మరణించే ప్రమాదాన్ని చాలావరకు తప్పించగలం.అందుకోసం.. కుటుంబచరిత్ర ఉన్నవారు ముందుగానే ఏడాదికోసారి తప్పనిసరిగా పూర్తి గుండెవైద్యపరీక్షలు చేయించుకోవాలి.ఒకవేళ మొదటి పరీక్ష చేయించుకున్నప్పుడు వారికి ఎలాంటి సమస్య లేదనుకున్నా, అప్పుడు కూడా మూడేళ్లకోసారి పరీక్షలు తప్పక చేయించుకోవాలి. కుటుంబ చరిత్ర లేకపోయినా.. కుటుంబంలో ఎవరికీ ఇలా సడన్ కార్డియాక్ అరెస్టు వచ్చిన చరిత్ర లేకపోయినా..కొన్ని ముప్పు కారకాలు ఉన్నవారు కూడా ప్రతియేటా పరీక్షలు చేయించుకోవాలి.వాటిలో మధుమేహం,అధిక రక్తపోటు, పొగ తాగే అలవాటు,మద్యపానం,అధిక కొలెస్టరాల్ ఉండడం లాంటివి ఉంటాయి.ఇవి ఉన్నవారు కూడా ఏడాదికోసారి తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకుంటే,గుండె ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకోవచ్చు.మధ్యప్రదేశ్ యువతి ఘటనతో పాటు ఇటీవలి కాలంలోనే మనం కొంతమంది క్రీడాకారులు,నటులు,రాజకీయ నాయకులు కూడా ఉన్నట్టుండి గుండెపోటుతో మరణించిన సంఘటనలు చూశాం.నిజానికి చేతిలో డబ్బులు పుష్కలంగా ఉన్నా,కొన్నిసార్లు ప్రాణాలు కాపాడేందుకు అవి పనికిరాకపోవచ్చు.అదే కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ఇలాంటి హఠాన్మరణాలను తప్పించే అవకాశం మన చేతుల్లోనే ఉంటుంది.అందువల్ల ఈ ముప్పు కారకాల్లో ఏ ఒక్కటి ఉందనుకున్నా..తప్పనిసరిగా ప్రతియేటా సమగ్ర వైద్య పరీక్షలు, అందులోనూ గుండె వైద్య పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలని డాక్టర్ సాయి రవిశంకర్ వివరించారు.

## ఇలాంటి పచ్చడి మీరు జీవితంలో తిని ఉండరు, అన్నం టిఫిన్స్‌లో అదిరిపోతుంది, ఎలా చేసుకోవాలంటే?




నువ్వులు ఆరోగ్యానికి చాలా మంచిదన్న విషయం తెలిసిందే. ఈ నువ్వులతో చేసే నూనె దేవుడికి నైవేద్యానికి కూడా సమర్పిస్తారు. నువ్వులను వివిధ రకాల స్వీట్స్ చేసుకోవడంతో పాటు పలు వంటల్లో కూడా వినియోగిస్తారు. అయితే ఈ నువ్వులతో చేసుకునే పచ్చడి మాత్రం వేరే లెవెల్‌లో ఉంటుంది. ఆరోగ్య ప్రయోజనాలతో పాటు అద్భుతమైన రుచి ఉంటుంది. దీనిని ఎలా చేసుకోవాలి? కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

నువ్వుల పచ్చడి తయారీకి కావాల్సిన పదార్థాలు నువ్వులు - 1 కప్పు ఎండు మిర్చి - 5-6 (మీ రుచికి తగినట్లు) చింతపండు - చిన్న ముద్ద వెల్లుల్లి రెబ్బలు - 4-5 జీలకర్ర - 1/2 టీస్పూన్ ఆవాలు - 1/2 టీస్పూన్ నూనె - 2 టేబుల్ స్పూన్లు ఉప్పు - రుచికి తగినంత

నువ్వుల పచ్చడి తయారీ విధానం: ముందుగా, నువ్వులను ఒక పాన్‌లో వేసి దోరగా వేయించుకోవాలి. అవి చిటపటలాడే వరకు వేయించాలి, కానీ మాడిపోకుండా జాగ్రత్తగా చూసుకోవాలి. అలా వేయించిన నువ్వులను ఒక ప్లేట్‌లో తీసుకొని చల్లారనివ్వాలి. ఇప్పుడు ఎండు మిర్చిని కూడా అదే పాన్‌లో కొద్దిగా నూనె వేసి వేయించుకోవాలి. అలాగే చింతపండును కొద్దిగా నీటిలో నానబెట్టాలి. ఆ తరువాత వేయించిన నువ్వులు, ఎండు మిర్చి, చింతపండు, వెల్లుల్లి రెబ్బలు, జీలకర్ర, ఉప్పు వేసి మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. అవసరమైతే కొద్దిగా నీరు కూడా కలుపుకోవచ్చు. ఇప్పుడు ఒక చిన్న పాన్‌లో నూనె వేసి ఆవాలు వేయాలి. ఆవాలు చిటపటలాడిన తర్వాత ఈ తాలింపును పచ్చడిలో కలపాలి. అంతే ఎంతో రుచికరమైన, ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే నువ్వుల పచ్చడి సిద్ధమైనట్లే.

## కోడి గుండెకాయల ఫ్రై,మీరెప్పుడూ తినని వంట..



చికెన్‌తో రకరకాల వంటకాలు చేసుకుంటూ ఉంటారు. అందులో కూరలు, ఫ్రైలు ఇలా చాలానే ఉంటాయి. అయితే మీరెప్పుడైనా కోడి గుండెకాయ తిన్నారా? కొందరు దీనిని తినడానికి ఇష్టపడరు. కానీ ఇవి చాలా రుచికరంగా ఉంటాయి. ఈ స్టోరీలో కోడి గుండెతో 65 ఫ్రై ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి? అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

కోడి గుండెకాయలతో ఫ్రై చేసుకోవడానికి కావాల్సిన పదార్థాలు పావుకిలో కోడి గుండెకాయలు ఫ్రై చేయడానికి సరిపడా నూనె రెండు చెంచాల కారం ఒక చెంచా పసుపు రుచికి సరిపడా ఉప్పు రెండు పచ్చిమిర్చి కొద్దిగా కరివేపాకు గరం మసాలా మిరియాల పొడి ధనియాల పొడి ఒక చెంచా అల్లం వెల్లుల్లి పేస్ట్ ఒక కోడి గుడ్డు కార్న్ ఫ్లోర్

కోడి గుండెకాయలతో ఫ్రై తయారీ విధానం ఈ కోడి గుండెకాయలతో ఫ్రై చేసుకోవడం చాలా సులభం. అందుకోసం ముందుగా కోడి గుండెకాయలు తీసుకోవాలి. వాటిని కత్తెరతో మధ్యలో నుంచి చీల్చి.. శుభ్రంగా కడుక్కొని ఓ ప్లేట్‌లో వేసుకోవాలి. ఇప్పుడు ఆ కోడి గుండెకాయలపై రెండు చెంచాల కారం, ఒక చెంచా పసుపు, రుచికి సరిపడా ఉప్పు, ధనియాల పొడి, గరం మసాలా, మిరియాల పొడి, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసుకోవాలి. ఆ మసాలాలు అంతా ఆ గుండెకాయలకు పట్టుకునే విధంగా బాగా కలుపుకోవాలి. అనంతరం అందులో కొద్దిగా కార్న్ ఫ్లోర్ వేసుకోవాలి. అలాగే ఒక గుడ్డు పగలగొట్టుకొని మొత్తాన్ని బాగా కలుపుకొని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక పాన్ తీసుకొని దానిపై గుండెకాయలను ఫ్రై చేయడానికి సరిపడా నూనె వేసుకోవాలి. అందులో మనం ముందుగా మసాలాలు దట్టించి పెట్టుకున్న కోడి గుండెకాయలను వేసుకొని బాగా ఫ్రై చేసుకోవాలి. అలా ఫ్రై చేశాక.. ఆ నూనెలోనే రెండు లేదా మూడు పచ్చిమిర్చి, కొద్దిగా కరివేపాకు కూడా వేసుకొని ఫ్రై చేసుకొని, గుండెకాయలపై పెట్టుకుంటే ఎంతో రుచికరమైన, అలాగే అద్భుతమైన కోడి గుండెకాయలా 65 సిద్ధమైనట్లే. మీరూ ఓసారి దీనిని ట్రై చేయండి.

## వీకెండ్ స్పెషల్ గా ఇంట్లో ఇది చేస్తే.. ఎగబడి తింటారు..ఎలా చేసుకోవాలంటే..





వడలు అంటే ఇష్టం లేని తెలుగు వాళ్లు ఎవరుంటారు చెప్పండి. అయితే ఏదో గ్యాస్ట్రిక్ సమస్యలతో కొందరు వడలకు దూరంగా ఉంటారు కానీ వడలపై ఇష్టం మాత్రం తగ్గదు. అయితే శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందించే కొత్తిమీర వడ ఎప్పుడైనా తిన్నారా? ఇది రుచికరమైన, ఆరోగ్యకరమైన చిరుతిండి. కొత్తిమీరలో విటమిన్లు %ూ, జ, ఖ%, ఇనుము, కాల్షియం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడతాయి. కొత్తిమీర జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తుంది. అలాంటి కొత్తిమీరతో వడలు ఎలా చేయాలి,దీని తయారీకి ఏమేం పదార్థాలు కావాలో ఇక్కడ చూడండి.

కొత్తిమీర వడ తయారీకి కావలసిన పదార్థాలు -కొత్తిమీర - 1 కట్ట -శనగపిండి - 1 కప్పు -బియ్యప్పిండి - 1/2 కప్పు - ఉల్లిపాయ - 1 (సన్నగా తరిగిన) -జీలకర్ర - 1/2 టీస్పూన్ -ధనియాల పొడి - 1/2 టీస్పూన్ -గరం మసాలా - 1/4 టీస్పూన్ -పచ్చిమిర్చి - 3 (సన్నగా తరిగిన) -అల్లం - 1/2 అంగుళం (సన్నగా తరిగిన) -ఉప్పు -ఆయిల్ కొత్తిమర తయారీ విధానం -కొత్తిమీరను శుభ్రంగా కడిగి సన్నగా తరుగుకోవాలి. -ఒక గిన్నెలో బియ్యప్పిండి, శనగపిండి, ధనియాల పొడి, గరం మసాలా, పచ్చిమిర్చి, అల్లం, ఉల్లిపాయ, జీలకర్ర, ఉప్పు వేసి బాగా కలపాలి. -తరిగిన కొత్తిమీరను పిండి మిశ్రమంలో వేసి బాగా కలపాలి. పిండిని మరీ పలుచగా చేయకూడదు కొంచెం గట్టిగా ఉండాలి. -అందులోనే కొద్దిగా నీళ్లు పిండిని వడల పిండిలా కలుపుకోవాలి. -ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి ఆయిల్ వేడి చేసి పిండిని చిన్న చిన్న వడలుగా వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. మంటను మీడియం ఫ్లేమ్‌లో ఉంచాలి. -వేడి వేడి కొత్తిమీర వడలు రెడీ. . -కొత్తిమీర వడను టొమాటో కెచప్ లేదా నచ్చిన చట్నీతో కలిపి తింటే అద్భుతంగా ఉంటుంది.

## జనసేన పార్టీ నిర్మాణ సమాచార సేకరణ కమిటీలు

### - నియమించిన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్

అమరావతి,జూన్4 : జనసేన పార్టీ నిర్మాణ సమాచార సేకరణ కమిటీలను ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ నియమించారు. జనసైనికుల నుంచే భవిష్యత్తు నాయకత్వాన్ని తీర్చిదిద్దే వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామని అధినేత చెప్పుకొచ్చారు.

## 5, 6, 7 తేదీల్లో హైటెక్స్ లో చేనేత వస్త్ర ప్రదర్శన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూన్4 : అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందిన పోచంపల్లి 'ఇక్కత్' వస్త్ర ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ఈనెల 5,6,7 తేదీల్లో ప్రత్యేక వస్త్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. పోచంపల్లి చేనేత కళాకారుల జీవన ప్రమాణాల మెరుగుపరిచే లక్ష్యంతో జూన్ 5, 6, 7 తేదీల్లో హైదరాబాద్ హైటెక్స్ లో 'త్రెడ్ పోచంపల్లి' పేరిట వస్త్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరచేందుకు ఏర్పాటు చేసే ఈ ఎగ్జిబిషన్ లో దాదాపు 100 పైగా స్టాల్స్, మహిళా శక్తి స్వయం సహాయక సంఘాల ద్వారా కూడా స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఒక అధికారిక ప్రకటనలో తెలిపారు.

## ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

మొదటిపేజీ తరువాయి

చేస్తున్నట్లు వివరించారు. జూన్ 6వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఇక వ్యవసాయశాఖకు చెందిన ఖాళీ భూముల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామన్నారు. ఈ ఆస్తుల రక్షణ కోసం ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఖాళీ స్థలాల్లో ఎ÷-లాంటేషన్ లేదా లీజు ద్వారా ఆదాయం సమీకరణ చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. తెలంగాణ ప్రభుత్వానికి చెందిన ఫెర్టిలైజర్ యాప్‌కు కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రశంసలు కురిపించిందని చెప్పారు. తెలంగాణ ఎరువుల పర్యవేక్షణ విధానం దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కేంద్ర ఫెర్టిలైజర్ యాప్ అమలుకు తెలంగాణను పైలట్ రాష్ట్రంగా ఎంపిక చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. యాప్ సమర్థ అమలుకు రాష్ట్రానికి ప్రోత్సాహకాలు అందిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. జూన్ 4, 6, 8, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. రైతులకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది సేవలు అందించాలని వారికి మంత్రి పొంగులేటి సూచించారు.

## అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

మొదటిపేజీ తరువాయి

పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. మంటలు వేగంగా వ్యాపించకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దట్టమైన పొగ కారణంగా పరిసర ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. భవనంలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు కూడా కొనసాగాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. అగ్నిప్రమాదంలో ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం ఎంత మేరకు జరిగిందనే విషయంపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అగ్నిప్రమాదం కారణంగా అమీర్‌పేట నుంచి ఎస్సార్ నగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో పరిసర ప్రాంతాల్లో భారీ ట్రాఫిక్ జామ్ నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఇతర మార్గాల వైపు మళ్లిస్తూ పరిస్థితిని నియంత్రించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు, వాహనదారులు అమీర్‌పేట-ఎస్సార్‌నగర్ మార్గాన్ని తాత్కాలికంగా నివారించి ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని అధికారులు సూచించారు. అలాగే విధుల్లో ఉన్న ట్రాఫిక్, అగ్నిమాపక సిబ్బంది, ఇతర అత్యవసర సేవల సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

## రేవంత్ పర్యటన..ముందుస్తు అరెస్ట్‌లు

మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ ప్రజా పాలనలో పోలీస్‌ల పహారాలు, నిర్బంధాలు ఎందుకని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వం అంటూ బీరాలు పలుకుతూ ప్రతిపక్ష నాయకులపై అంక్షలు ఎందుకని నిలదీశారు. మూడు సంవత్సరాల పాలనకే ఇంత అభద్రతాభావమా.. ఇంతటి అరాచకమా? అని మండిపడ్డారు. పెండింగ్ ప్రాజెక్టులపై ప్రతిపక్ష పార్టీల సూచనలను, ప్రజల ఆలోచనలను పరిగణనలోకి తీసుకోకుండా హడావుడిగా ప్రాజెక్టుల సందర్శన చేపట్టడం విచారకరమని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల అరెస్టును తీవ్రంగా ఖండించారు.

## ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలి

మొదటిపేజీ తరువాయి

ఆయన ఆత్మకే తెలుసని విమర్శించారు. ధాన్యం సేకరణపై కాంగ్రెస్, బీజేపీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ రైతు గురించి ఆలోచించడం లేదని విమర్శించారు. పప్పు దినుసులు, నూనె గింజలు పండించాలని సలహా ఇస్తున్న ప్రభుత్వం వాటికి ఏ విధమైన ప్రోత్సాహం కల్పిస్తుందో చెప్పడం లేదని పేర్కొన్నారు. కోతుల బెడద నుంచి పంటలను కాపాడేందుకు కోతుల పునరుత్పత్తి నిలుపుదల కేంద్రాన్ని జిల్లాకు ఒకటి ఏర్పాటు చేయాలని, తక్షణమే రైతుకు సోలార్ ఫెన్సింగ్ 50 శాతం రాయితీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్లో యూరియా అందుబాటులో లేదని, యూరియా యాప్‌ను తొలగించి నేరుగా రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు

### ప్రజలకు అదనపు కలెక్టర్ సూచన



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల,జూన్4 : వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. సారంగాపూర్ మండలంలోని సారంగాపూర్, బట్టపల్లి, పోతారం, నాయకపు గూడెం, బీర్పూర్ మండలంలోని బీర్పూర్, నర్సింహులపల్లి, తుంగూర్, కందేనకుంట గ్రామాల్లో అధికారులు ప్రత్యేక గ్రామసభలు గురువారం నిర్వహించారు. బీర్పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు గ్రామాల్లో వర్షాకాలంలో పారిశుద్య నిర్వహణపై ఆ చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు, పారిశుద్య నిర్వహణ, ఎలినినో ప్రభావ పరిస్థితుల్లో రైతులు పంటల మార్పిడీ చేసుకోవడం, మ చర్యలు, గ్రామాల్లో ఇంకుడు గంతల నిర్మాణాల ఏర్పాటు, నీటిని పొదుపుగా వాడుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశాల్లో బీర్పూర్ మండల ప్రత్యేక అధికారి ప్రకాష్, తహసీల్దార్లు వహిదొద్దిన్, సుజాత, ఎంపీడీఓలు ఎండి సలీం, భీమేష్ ప్రజాప్రతినిధులు చేకూట ఆరుణ శేఖర్, మర్రిపెల్లి అశ్విని, పుష్పనాథ్, మల్యాల జ్యోతి, ఎలమట్ల హరీష్, ఎడ్ల సృజన సుశీన్, హర్షకోట రాజగోపాల్ రావు, కొమిరే నర్సయ్య, ఆయా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం

### - ఉద్యమకారుల సంఘాలను కలిసి వివరాలు సేకరిస్తాం
### - అఖిలపక్ష భేటీలో కమిటీ చైర్మన్ కేశవరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూన్4 : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా పాల్గొన్న ఉద్యమకారులందరికి న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కె. కేశవరావు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం కె. కేశవరావు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీతో గురువారం హైదరాబాద్ సచివాలయంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం కేకే మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలను మళ్లీ కలుస్తామని అన్నారు. అందుకోసం ఉద్యమకారులందరినీ పిలిచి మాట్లాడతామని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని వివరించారు. ఈ అఖిల పక్షం సమావేశంలో అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థులతో, ఉద్యమకారుల సంఘాలతో అనుబంధం ఉన్న వారిని మళ్లీ కలుస్తామని కె.కేశవరావు తెలిపారు. ఉద్యమకారులందరిని పిలిచి మాట్లాడుతామన్నారు. తెలంగాణ తొలి దశతోపాటు మలి దశ ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలంగాణ రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఉద్యమకారులందరితోనూ మాట్లాడతామన్నారు. నష్టపోయిన అందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. ఈ ప్రజా పాలన ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడానికి ఏర్పాటు చేసిన కమిటీ.. అఖిలపక్ష పార్టీల నుంచి ఇద్దరి చొప్పున పిలిచామని పేర్కొన్నారు. పార్టీలు మాత్రమే కాకుండా ఉద్యోగ, విద్యార్థి, జర్నలిస్ట్, న్యాయవాదులు అందరినీ పిలిచి మాట్లాడతామని వివరించారు. కవులు, కళాకారులు తెలంగాణ సాధన కోసం పని చేసిన అందరిని గుర్తిస్తామన్నారు. ఈ ప్రక్రియ అమరవీరుల ద్వీపంలో ప్రారంభమవుతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం ఇవ్వాలని, వారిని గుర్తించాలని, అలాగే అందరి నుంచి సూచనలు స్వీకరించాలని నిర్ణయించామన్నారు. రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విజ్ఞప్తులు స్వీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ఉద్యమ సమయంలో తన జీవితంలో యవ్వనం పోయిందని.. మమ్మల్ని ఆదుకోవాలని ఉద్యమకారులు కోరుతున్నారని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. అందుకోసం ఉద్యమకారుల జేఏసీలు ఉన్నాయని.. వారిందరినీ కలుస్తామన్నారు. అలాగే అన్ని యూనివర్సిటీల జేఏసీలు ఉన్నాయని.. వారితో కూడా సమావేశమవుతామని ఎమ్మెల్సీ కోదండరాం స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి జేఏసీ, యూనివర్సిటీ జేఏసీలను సంప్రదిస్తామని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ వెల్లడించారు. అందరి సలహాలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన అని చెప్పారు. స్టేక్ హోల్డర్స్‌ను పిలిచి మాట్లాడతామన్నారు. అందరి అభిప్రాయాలు తీసుకొని ఉద్యమకారులను గుర్తిస్తామని పేర్కొన్నారు.

## కొడంగల్ ఎత్తిపోతల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు

మొదటిపేజీ తరువాయి

ఫోటో ఎగ్జిబిషన్ ప్లాన్ మ్యాప్స్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించిన ఇరిగేషన్ అధికారులు. ÷ూష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మక్తల్ మండలం కాట్రేవు పల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల ప్యాకేజ్ -1 పనులను గురువారం పరిశీలించారు. ప్యాకేజ్ -1 లో భాగంగా జరుగుతున్న పంప్ హౌస్ పనులు ఎంత శాతం పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంక్రీటు పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వాకిటి శ్రీహరి, కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక, ఇరిగేషన్ కార్యదర్శి శ్రీదర్, చీఫ్ ఇంజనీరు. ఏ సత్య నారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ హెచ్.టి శ్రీధర్, ఉన్నారు.

## పవన్ కళ్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారా?

మొదటిపేజీ తరువాయి

ను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాంచందర్ రావు ఆగ్రహించారు. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన వారితో చేతులు కలిపింది ఎవరో..? బీఆర్ఎస్ నేతలు చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని శక్తులతో అధికార రాజకీయాలు చేసింది ఎవరు..? అని నిలదీశారు. తెలంగాణను తిట్టిన వారిని, ఉద్యమకారులను అవమానించిన వారిని బీఆర్ఎస్‌లో చేర్చి పదవులు ఇచ్చింది ఎవరు..? అని ప్రశ్నించారు. తెలంగాణ పేరుతో రాజకీయాలు చేసే ముందు మీ రాజకీయ చరిత్రను ఒకసారి ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం మీద ప్రేమ ఉంటే డ్రామాలు కాదని... నిజాలు మాట్లాడాలని సవాల్ విసిరారు. ప్రజలు ఇప్పుడు భావోద్వేగాలకు కాదని, మీ గతానికి కూడా లెక్క అడిగే స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్.. జనసేన సభ కోసం అనుమతి అడిగారని... ఇచ్చి ఉంటే కథ అక్కడే ముగిసేదని.. సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో కాంగ్రెస్ సర్కార్ చెప్పాలని రాంచందర్ రావు ప్రశ్నించారు. ఈ సమావేశం పెట్టుకోవడం ప్రతి ఒక్కరి ప్రజాస్వామ్య హక్కు అని చెప్పారు. దాన్ని అడ్డుకోవడమే ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. పవన్ కల్యాణ్ అంశాన్ని బీజేపీ మీద రుద్దే ప్రయత్నం చేయడం రాజకీయ దివాళాకోరుతనమని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కలిస్తేనే కొందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన వారికి కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు ఇచ్చారని రాంచందర్ రావు ఆగ్రహించారు. ఏపీలో బీఆర్ఎస్ ఆఫీస్ పెట్టలేదా..? అని ప్రశ్నించారు. తెలంగాణ నిధులను పంజాబ్‌లో కేసీఆర్ పంచలేదా..? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేని పరిస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని విమర్శించారు. బీజేపీ సపోర్ట్ చేయడంతోనే తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు. ఆనాడు పార్లమెంటులో తమ పార్టీ మద్దతు ప్రకటించిందని అన్నారు. సుష్మా స్వరాజ్ బేషరతుగా మద్దతు ఇస్తేనే తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కార్ ఇస్తానని చెప్పిన జాబ్ క్యాలెండర్ ఏమైంది..? అని రాంచందర్ రావు ప్రశ్నించారు. 12 ఏళ్ల నుంచి నీళ్ల మీద ఒక పాలసీ కూడా ఎందుకు తేలేదని నిలదీశారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల వాటా కంటే తక్కువ వాటాను కేసీఆర్ ఒప్పుకున్నారని ప్రస్తావించారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలను డీకే శివకుమార్‌కి.. రేవంత్‌రెడ్డి బహుమతిగా ఇచ్చారని విమర్శించారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను అప్పుల్లోకి నెట్టారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ సూపర్ హీరో అని రాంచందర్ రావు అభివర్ణించారు. ముమ్మందు బిజెపి తెలంగాణలో కీలకంగా మారుతుందన్నారు.

## మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు

మొదటిపేజీ తరువాయి

ఎకరం కనీసం రూ.15 లక్షలు ఉందని చెప్పారు. లోయర్ సైడ్ ఏమైనా పొరపాటు జరిగితే మార్పులు చేర్పులు ఉంటాయని చెప్పారు. హయ్యర్ సైడ్ మాత్రం మార్పులు ఉండవన్నారు. సమస్యలు ఉంటే.. హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేస్తామని పబ్లిక్‌కు ఆయన సూచించారు. త్వరలో తహసీల్దార్ల బదిలీలు ఉంటాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేసే అవకాశమే లేదని స్పష్టం చేశారు. రెవెన్యూ విషయంలో.. తెలంగాణను మిగతా రాష్ట్రాలు మోడల్‌గా తీసుకుంటున్నాయని గుర్తు చేశారు. ఏడాదిన్నరలో 90 శాతం గ్రామాల సర్వే పూర్తవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రెవెన్యూలో అవినీతి లేకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఆ క్రమంలోనే అవినీతి నిరోధక శాఖ ట్రాప్‌లు అధికంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. వచ్చాక ఏసీబీ ట్రాప్ ఆయిన్న ÷ల్స్ అన్ని క్లియర్ చేశానని తెలిపారు. గత ప్రభుత్వంలో మూడేళ్లు రెవెన్యూ ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. కానీ తాను వచ్చిన మూడు నెలల్లోనే 3,500 రెవెన్యూ ఫైల్స్ క్లియర్ చేశానని వివరించారు. అసెంబ్లీలో పెండింగ్‌లో ఉన్న 10 ఏళ్ల ఫైల్స్ ఆరు నెలల్లోనే క్లియర్ చేసినట్లు చెప్పారు. తనకు ఏ శాఖ కేటాయించినా.. కళ్లు మూసుకొని పని చేస్తానని పేర్కొన్నారు. రజలకు, ప్రభుత్వానికి మంచి జరిగే ఏ పని చేయడానికైనా తాను భయపడనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుండబద్దలు కొట్టారు. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇండ్లకు రూ. 7 వేల కోట్లు చెలించామని చెప్పారు. రాష్ట్రంలో పాడి ప్రోక్యూర్‌మెంట్ 90 శాతం పూర్తయిందన్నారు. అసైన్డ్ భూములకు పాలసీ తీసుక వస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగినవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వాటిని నిషేధిత జాబితాలో చేర్చిందని మంత్రి పొంగులేటి వివరించారు.

## టూ వీలర్ స్కిడ్..దూసుకెళ్లిన బస్సు

### ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూన్4 : నగరంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై బురద చేరింది. ఇదే ఓ విద్యార్థి ప్రాణాలు పోవడానికి కారణమైంది. సికింద్రాబాద్ పరిధిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. నగరంలో కురిసిన వర్షానికి రోడ్డుపై బురద చేరింది. ఈ క్రమంలో బైకుపై వస్తున్న ఓ యువకుడు స్కిడ్ అయి.. అదే సమయంలో పక్కనే వెళు న్న ఆర్టీసీ బస్సు కిందికి దూసుకుపోయాడు. బస్సు అతడి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న మార్కెట్ స్టేషన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడు గురునానక్ కాలేజీలో బీటెక్ చదువుతున్న మదన్ మోహన్‌గా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. మదన్ మోహన్ అకాల మరణంతో అతని కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

## పవన్ కళ్యాణ్‌పై మరోమారు ప్రకాశ్ రాజ్ సెటైర్లు

### - ఘాటుగా తిప్పికొట్టిన నిర్మాత బండ్ల గణెళిశ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూన్4 : ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అంశంలో నటుడు ప్రకాశ్ రాజ్, నిర్మాత బండ్ల గణెళిశ్ మధ్య సోషల్ మీడియా ఎక్స్‌లో వార్ నడుస్తోంది. తెలంగాణలో జనసేన పోటీ చేస్తుందంటూ పవన్ చేసిన వ్యాఖ్యలపై ప్రకాశ్ రాజ్ సెటైర్ వేస్తే.. ప్రకాశ్ రాజ్‌కు బండ్ల గణెళిశ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో జనసేన పోటీపై ఎక్స్‌లో పోస్ట్ చేసిన ప్రకాశ్ రాజ్.. పవన్‌ను ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'మీరొస్తామంటే మేమొద్దంటామా.. రండి దొర. సింగిల్‌గా వస్తున్నారా.. పొత్తుతో వస్తున్నారా చెప్పి రండి' అని ప్రకాశ్ రాజ్ పోస్ట్ చేశారు. ప్రకాశ్‌రాజ్ పోస్ట్‌కు బండ్ల గణెళిశ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ప్రతి దాంట్లో ఎందుకు వేలు పెడతావంటూ ప్రశ్నించారు. 'అసలు నువ్వెవరు.. తమిళోడివా? తెలుగోడివా? కన్నడిగుడివా? ప్రతి విషయంలో జడ్జిమెంట్ ఇవ్వడానికి నువ్వేమైనా ప్రధానివా. అందరి విషయాల్లో దూరి హీరోలా ఫీలవ్వకు. ముందు నీ అడ్రస్ నువ్వు తెలుసుకో. తర్వాత ప్రపంచాన్ని మార్చే ప్రయత్నం చేయ్' అంటూ ప్రకాశ్ రాజ్‌ను ఉద్దేశించి బండ్ల గణెళిశ్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రకాశ్ రాజ్, బండ్ల గణెళిశ్ మధ్య సోషల్ మీడియా ఎక్స్ వేదికగా జరుగుతున్న వార్.. చర్చనీయాంశంగా మారింది.

## రైతులు ఇబ్బందులను పట్టించుకోని సిఎం

### పర్యటనలతో ఒరిగేదేమీ లేదు: నిరంజన్ రెడ్డి

వనపర్తి,జూన్4 : రాష్ట్ర రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడ్డ సమయంలో కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాజెక్టుల సందర్శన పేరుతో హడావుడి చేస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. సీఎం గురువారం పాలమూరు పర్యటన సందర్భంగా పలు ప్రశ్నలు సంధించారు. విపత్తుల సమయంలో రాకుండా, రైతుల సమస్యలను పరిగణనలోకి తీసుకోకుండా చేస్తున్న ఈ పర్యటనలు ఎవరికి ఉపయోగమని నిలదీశారు. సీఎం పర్యటనే వేళ తెలంగాణ వాదులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం సబబు కాదని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ వడ్లు కల్లాల్లోనే ఉన్నాయని,రైతు భరోసా అడుగుతారనే హెలికాప్టర్‌లో పర్యటిస్తున్నారని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలు ఆశలు కోల్పోయారని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, భవిష్యత్తులో వారికి పరాభవం తప్పదని హెచ్చరించారు.

## కార్మికులకు అండగా నిలిచేది బిఆర్ఎస్

మొదటిపేజీ తరువాయి

ఇబ్బంది లేకుండా త్రాగునీటిని సరఫరా చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం త్రాగునీటిని కూడా సక్రమంగా ఇవ్వలేకపోతుందని మండిపడ్డారు. మీకు అండగా ఉండేది బీఆర్ఎస్ పార్టీ అని, మీ హక్కుల కోసం అసెంబ్లీ లోపల, బయట ప్రభుత్వాన్ని నిలదీస్తామని ప్రకటించారు. మీ కోసం గొంతుక వినిపించే గులాబీ జెండాకు మద్దతు తెలపాలని తలసాని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బోర్డులోని అనేక సమస్యలను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. అటు సూర్యుడు ఇటు పొడిచినా మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తలసాని హామీ ఇచ్చారు.

## నగరంలో వరుసగా అగ్నిప్రమాదాలు

మొదటిపేజీ తరువాయి

స్పందించి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు, కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా అగ్నిమాపక శాఖకు అవసరమైన ఆధునిక పరికరాలు అందుబాటులో కి తేవాలని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే సకాలంలో స్పందించిన అధికారులను ఆయన అభినందించారు. ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, నాయకులు అశోక్ యాదవ్, నామన సంతోష్, ప్రవీణ్ రెడ్డి, సుమిత్ సింగ్, కట్టా బలరాం, సాయి, ప్రదీప్ గౌడ్, తదితరులు ఉన్నారు.

# భవిష్యత్తు తరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకుందాం



**- గ్రామాల్లో పరిశుభ్రత, చెత్త నిర్వహణపై ప్రత్యేక దృష్టి అవసరం**
**- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**
**- ఎస్ఐఆర్‌పై అపోహలు వీడి ప్రజలు సహకరించాలి.**
**- గోళ్లపాడు గ్రామసభలో కలెక్టర్ పిలుపు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూన్ 4:భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అన్నారు. గ్రామాల్లో చెత్త నిర్వహణ, పరిశుభ్రత, పచ్చదనం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న కలెక్టర్ ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, వార్డు సభలు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే కీలక వేదికలని పేర్కొన్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. రైతులు పంటల మార్పిడి విధానాన్ని అవలంబించాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆయిల్‌పామ్, కూరగాయలు, పండ్ల తోటల వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహిస్తూ, రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా, కాలుష్యం కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం స్వచ్ఛమైన తాగునీటి కోసం డబ్బులు చెల్లిస్తున్నామని, భవిష్యత్తులో స్వచ్ఛమైన గాలి కోసం కూడా చెల్లించాల్సిన పరిస్థితి రాకుండా పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని సూచించారు. అడవుల నరికివేత, వాతావరణ మార్పుల ప్రభావంతో వరదలు, వన్యప్రాణుల సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మురుగు కాల్వల శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, నీటి సంరక్షణ చర్యలు, కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. వరదల సమయంలో ప్రజలు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని తెలిపారు. భారీ వర్షాల సమయంలో పాత ఇళ్లలో నివసించే వారు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని, వరద నీరు ప్రవహించే రహదారులు, కల్వర్టులపై ప్రయాణాలు చేయరాదని హెచ్చరించారు. ప్రమాదకర ప్రాంతాల్లో సెల్ఫీలు తీసుకోవడం ప్రాణాపాయానికి దారితీస్తుందని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మరణించినవారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయినవారు, డూప్లికేట్ ఓట్లు మాత్రమే తొలగిస్తామని చెప్పారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోరని భరోసా కల్పించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని తెలిపారు. ప్రజలు తమ వివరాలను నమోదు చేసి అవసరమైన ధ్రువపత్రాలను జతచేసి సమర్పించాలని సూచించారు. జూలై 31న డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేసి, అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిశీలించిన అనంతరం అక్టోబర్ 1, 2026న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బి. జ్యోతి, ఆత్మ పీడీ బి. సరిత, ఏవో ఉమా నగేష్, పశువైద్యాధికారి జగ్గులాల్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# విద్యుత్ కోసం రెండేళ్ల నిరీక్షణ... అధికారుల నిర్లక్ష్యానికి గుండ్లమడుగు బలి!



**- చెప్పులు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న గ్రామ ప్రజలు**
**- నాగరిక సమాజంలో ఉన్నామా? ఆటవిక సమాజంలో ఉన్నామా?**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, జూన్ 4 : భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలం ఉలవనూరు-లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గుండ్లమడుగు గ్రామ ప్రజలకు విద్యుత్ సౌకర్యం ఇప్పటికీ అందని ద్రాక్షగానే మారింది. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా, నేటికీ విద్యుత్ కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొనడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. గ్రామానికి విద్యుత్ కనెక్షన్ కల్పిస్తామని చెప్పిన విద్యుత్ శాఖ అధికారులు సుమారు రూ.6 వేల చలానా వసూలు చేసినప్పటికీ, రెండేళ్లు గడిచినా ఒక్క కరెంటు పోల్ కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో "డబ్బులు తీసుకోవడానికే వేగం... పని చేయడంలో మాత్రం జాప్యమేనా?" అంటూ గ్రామస్థులు మండిపడుతున్నారు. విద్యుత్ అధికారులు మాత్రం అటవీ శాఖ నిరభ్యంతర ధృవీకరణ పత్రం (ఎన్ఓసీ) లేకపోవడమే కారణమని చేతులు దులుపుకుంటుండగా, అటవీ శాఖ అధికారులు కూడా ఫైళ్లను ముందుకు కదపకపోవడంతో గ్రామ ప్రజలు రెండు శాఖల మధ్య నలిగిపోతున్నారు. రెండు సంవత్సరాలుగా ఫారెస్ట్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎన్ ఓ సీ మంజూరు కాకపోవడం అధికార యంత్రాంగం పనితీరుపై తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను రెండుసార్లు తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రజల ప్రాథమిక అవసరమైన విద్యుత్ సౌకర్యాన్ని కల్పించడంలో అధికారులు ఎందుకు విఫలమయ్యారు? గ్రామస్థుల ఇబ్బందులను పట్టించుకునే నాథుడు లేడా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని విద్యుత్, అటవీ శాఖల మధ్య సమన్వయం సాధించి గుండ్లమడుగు గ్రామ ప్రజలకు విద్యుత్ వెలుగులు అందించాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే అధికారుల నిర్లక్ష్యానికి గిరిజన, గ్రామీణ ప్రజలే బలవుతారనే విమర్శలు మరింత బలపడే అవకాశం ఉంది.

# గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి




**- గంజాయి, మాదకద్రవ్యాలు, బాల్యవివాహాల నిర్మూలనకు సహకరించాలి**
**- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్, జూన్ 4: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గూడూరు మండలం అప్పరాజుపల్లి, పడమటి తండా గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అన్నారు.గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతను కాపాడడంతో పాటు గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం, రవాణా,బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచి ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు.రైతులు పంట మార్పిడి విధానం, సేంద్రియ ఎరువులు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. వరి కొయ్యలను కాల్చకుండా నేలలో కలపడం, పశువుల మేతగా లేదా బయోగ్యాస్ తయారీలో వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల స్థలాలు, జనగణన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, తహసీల్దార్ నాగభవాని, వ్యవసాయ అధికారి మహమ్మద్ అబ్దుల్ మలిక్, ఇంచార్జి ఎంపీడీవో పృథ్వీరాజ్, సర్పంచులు భరత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక..

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు (వెంకటాపూర్), జూన్ 4 : గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని, రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని,ఉపాధి హామీ పథకంలో ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు.99 రోజుల ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వెంకటాపూర్ మండలం కేశవాపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పాల్గొని గ్రామ ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలను సందర్శించి గ్రామాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామసభలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు అందించే పథకాల ప్రయోజనాలు సకాలంలో అందాలంటే నమోదు కీలకమని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు,రైతు వేదికల ద్వారా రైతులకు పూర్తి సహకారం అందుబాటులో ఉంటుందని చెప్పారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రజలు అధికంగా పాల్గొనాలని,ఉపాధి పనుల్లో కార్మికుల భాగస్వామ్యం పెరిగితే గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు,వీఓ భవనాలు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరింత నిధులు లభించే అవకాశం ఉంటుందని వివరించారు.ఈ కార్యక్రమంలో డీపీఓ వెంకయ్య, పంచాయతీరాజ్ శాఖ అధికారులు,గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు,అధికారులు, వార్డు సభ్యులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



(ప్రజాలక్ష్యం బ్యూరో)

మంచిర్యాల, జూన్ 4: ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో ప్రభుత్వం చేపట్టిన గ్రామ/డివిజన్/వార్డు సభలలో భాగంగా గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం రాపల్లి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన గ్రామసభకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సాయి వెంకట్ రెడ్డి, మండల విద్యాధికారి తిరుపతి, సర్పంచ్ రామ్ రెడ్డి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళి 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో ప్రత్యేక సభలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈసారి వర్షం తక్కువగా ఉన్నందున తదనుగుణంగా సాగు చేయగల పంటలను రైతులు ఎంపిక చేసుకోవాలని, ఆ దిశగా వ్యవసాయ, విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. యూరియా పంపిణీకి సంబంధించి యాప్ లో నమోదు చేయబడిన రైతులు, పంట, సాగు వివరాలకు అనుగుణంగా విడతల వారీగా యూరియా అందించడం జరుగుతుందని తెలిపారు. ఒకే రకమైన పంట సాగు చేయడం వలన భూసారం తగ్గుతుందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని, నానో యూరియా, డి ఎ పి, ప్రభుత్వం చేవీకరించబడిన విత్తనాలను మాత్రమే రైతులు వినియోగించాలని తెలిపారు. భూమి రకాన్ని బట్టి దాదాపు పత్తి పంట ఎకరానికి 14 నుండి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, రైతులకు మద్దతు ధర అందించడం జరుగుతుందని తెలిపారు. చిన్న, సన్న కారు రైతులు ప్రత్యామ్నాయంగా కూరగాయల పంటల సాగుపై దృష్టి సారించాలని, పంట సాగుకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని లబ్ధి పొందాలని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టడం ద్వారా ఈ సంవత్సరం ఇప్పటివరకు ఎలాంటి డెంగ్యూ కేసులు నమోదు కాలేదని, ఇలాగే కొనసాగించినట్లయితే వ్యాధుల నియంత్రణ సులభతరం అవుతుందని తెలిపారు. ప్రతిరోజు తడి, పొడి చెత్తను సేకరించాలని, ఉపయోగపడే వ్యర్థాల ద్వారా కంపోస్టు చేసి రైతులకు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం, జనగణన కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. సమగ్ర సవరణ కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. జన గణన ప్రక్రియలో వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. విద్యావవస్థ బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. జూనియర్ కళాశాలలలో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని, ఈ విద్యా సంవత్సరం వార్షిక ఫలితాలలో దాదాపు 98 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం జరిగిందని తెలిపారు. ఈ వేసవిలో ప్రజలకు ఎలాంటి త్రాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు కార్యాచరణతో చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. వైద్యం, విద్య, మహిళా రక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల తహసీల్దార్ల దృష్టికి తీసుకురావచ్చని, టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలించిన అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం, జూన్ 4 : జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ గురువారం కాటారం మండలంలోని ఏఎంసీ గోదాం, రుద్ర కాటన్ మిల్లు, మీనాక్షి జిన్నింగ్ మిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, రైతులు తీసుకొచ్చే ధాన్యం దిగుమతిలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇన్‌చార్జ్‌లకు సూచించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియలను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గోదాంలలో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ధాన్యం నాణ్యత దెబ్బతినకుండా నిల్వ నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా వ్యవహరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎం రాములు తదితర అధికారులు పాల్గొన్నారు.



# మహిళల హక్కుల కోసం చారిత్రక పోరాటాలు చేసిన మహిళా సమాఖ్య

**- ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి**
**- ఘనంగా ఎన్ఎఫ్ఐడబ్ల్యూ 72వ వ్యవస్థాపక దినోత్సవం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూన్ 4: మహిళల హక్కులు, సమానత్వం కోసం దేశవ్యాప్తంగా చారిత్రక పోరాటాలు నిర్వహించిన ఘనత భారత మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ)కు దక్కుతుందని జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి పేర్కొన్నారు.మహిళా సమాఖ్య దశాబ్దాలపోరాట చరిత్ర లో అనేక విజయాలను సాధించిందని ఆమె అన్నారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ 72వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో మహిళా సమాఖ్య పతాకాన్ని ఏపూరి లతాదేవి ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా మహిళలు ఇంకా వివక్షను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నప్పటికీ వివక్ష పూర్తిగా తొలగిపోలేదని పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాల అమలులో లోపాలు ఉన్నాయని, నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మహిళలు అనుభవిస్తున్న అనేక హక్కులు, చట్టాల వెనుక మహిళా సమాఖ్య చేపట్టిన ఉద్యమాల పాత్ర ఉందని లతాదేవి గుర్తుచేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు తమ సంస్థ నిరంతరం పోరాడుతోందని, డిలిమిటేషన్ ప్రక్రియతో ముడిపెట్టి బిల్లును ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు. మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని, మహిళలపై జరిగే నేరాలకు సంబంధించిన కేసుల్లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా త్వరితగతిన న్యాయం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు పోటు కళావతి, జిల్లా నాయకులు జమ్ముల లక్ష్మి, మందడపు రాణి, దండి రాజేశ్వరి, ఓరుగంటి ప్రమీల, భవాని, సృజన, కృష్ణవేణి, సౌజన్య, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




# ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేందుకు సమన్వయంతో పనిచేయాలి

**- కలెక్టర్ దివాకర్ టీఎస్**
**- ఎస్ఐఆర్‌పై కేంద్ర ఎన్నికల సంఘం వీడియో కాన్ఫరెన్స్ శిక్షణ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూన్ 4 : ప్రత్యేక సమగ్ర పునర్విమర్శ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి అర్హుడైన వ్యక్తికి ఓటు హక్కు కల్పించడమే ప్రధాన లక్ష్యమని, ఇందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు విలాస్ దుబే, అమృత ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఎస్ఐఆర్ శిక్షణ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం ప్రతినిధులు ఎన్యుమరేషన్ ఫారాల ముద్రణ, పంపిణీ, డిజిటలైజేషన్, డేటా నమోదు, ధృవీకరణ తదితర అంశాలపై అధికారులకు శిక్షణ అందించారు. శిక్షణ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పూర్తయిన మ్యాపింగ్ ప్రక్రియను సూపర్వైజర్లు మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. 2002 ఎస్ఐఆర్ ఓటర్లు, వారి కుటుంబ సభ్యుల వివరాలను తప్పనిసరిగా మ్యాప్ చేసి క్రాస్ వెరిఫికేషన్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, రాజకీయ పార్టీలకు అనుబంధం లేని వాలంటీర్లను గుర్తించి వారికి తగిన శిక్షణ ఇవ్వాలని తెలిపారు. మ్యాపింగ్ పూర్తయిన తర్వాత మిగిలిన ఓటర్లందరి నుంచి ఎన్యుమరేషన్ ఫారాలను సేకరించాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాల్లో నమోదు చేసిన ఈపిక్ నంబర్లతో పాటు ఇతర వివరాలను కూడా క్షుణ్ణంగా పరిశీలించి ధృవీకరించాలని పేర్కొన్నారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా బీఎల్‌వోలకు పూర్తి స్థాయి శిక్షణ అందేలా సూపర్వైజర్లు పర్యవేక్షించాలని, ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన ఫారాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఆర్ఓ, ఆర్డీఓ శ్రీనివాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డీటీ అన్సారీతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జూన్ 6న జాబ్ మేళా-40 ప్రైవేట్ ఉద్యోగాల భర్తీకి అవకాశం

**- నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి**
**- జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూన్ 4 : ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 6వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి తెలిపారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె వివరాలు వెల్లడిస్తూ, ఖమ్మంలోని నేషనల్ మార్ట్ సంస్థలో ఉద్యోగాల భర్తీ కోసం శనివారం ఉదయం 10 గంటలకు ఖమ్మం హవేలీ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న టీటీడీసీ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. హ్యూమన్ రిసోర్స్ (మేల్) ఉద్యోగాలకు ఎంబీఏ (హెచ్ఆర్) అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే క్యాషియర్, సీఎస్ఏ, సీఎస్ఆర్ ఉద్యోగాల కోసం పురుష, మహిళా అభ్యర్థులు ఎస్సెస్సీ ఉత్తీర్ణత సాధించి ఉండాలని పేర్కొన్నారు. 27 సంవత్సరాల లోపు వయస్సు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. మొత్తం 40 ఉద్యోగ ఖాళీల భర్తీ కోసం ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్న ఆమె, ఎంపికైన అభ్యర్థులకు ఖమ్మంలోనే ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఆసక్తి, అర్హత కలిగిన నిరుద్యోగ యువత తమ విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం హెచ్ఆర్ సెల్ నంబర్ 7337444265 ను సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి కోరారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com